ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -59 పేజీలు - 8 వెల - 03/- గురువారం 18 జూన్ 2026

# హర్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

**భారత నావికుల రక్షణ మాకు ముఖ్యం**

- హర్మూజ్‌పై ఆంక్షలు తొలగించడం ప్రపంచానికి అవసరం
- ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ
- మోడీ తనకు మంచి మిత్రుడు అంటూ మరోమారు ట్రంప్ వ్యాఖ్య




**ప్యారిస్, జూన్ 17,రిపబ్లిక్ న్యూస్** హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, మిగతా2లో...

# యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలి

- 21 యోగా దినోత్సవానికి పటిష్టంగా ఏర్పాట్లు చేయాలి
- అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు సూచన



**అమరావతి, జూన్ 17,రిపబ్లిక్ న్యూస్** అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో, ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 'యోగాంధ్ర-2026' ఏర్పాట్లపై బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. యోగా దినోత్సవాన్ని కేవలం కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు. శాఖల మధ్య సమన్వయం మరింత బలంగా ఉండాలని, అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని మిగతా2లో...



# సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

- ప్రజలను మోసగించే వారు సమాజానికి చేటు
- అలాంటివారు జైల్లో ఉండడమే కరెక్ట్
- సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, జూన్ 17,రిపబ్లిక్ న్యూస్** సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం. మిగతా2లో...

# ఎపిలో విస్తరించిన ద్రోణి

- ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
- ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడి



**అమరావతి, జూన్ 17,రిపబ్లిక్ న్యూస్ :** తూర్పు విదర్భ - తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ బుధవారం వెల్లడించింది. ఈ ద్రోణి ప్రభావంతో గురువారం రాష్ట్రంలో మిగతా2లో...

# వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

- అభిమాని చిన్నారి నిరంజన్‌కు పరామర్శ
- వైద్యం కోసం లక్ష రూపాయాల ఆర్థికసాయం
- భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు



**వరంగల్, జూన్ 17,రిపబ్లిక్ న్యూస్ :** ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ (17)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. బుధవారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడితో కొద్దిసేపు ముచ్చటించారు. నిరంజన్ కుటుంబానికి పవన్ భరోసా ఇచ్చారు. నిరంజన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి నుంచి మీరంటే ప్రాణం అని చెప్పిన నిరంజన్ మాటలకు పవన్ చలించి పోయారు. నిరంజన్‌ను హత్తుకుని ముద్దాడారు. తను ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ పాటలకు వేసిన డాన్స్‌ల వీడియోలను నిరంజన్.. పవన్‌కు చూపించారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు అందించారు. భద్రకాళి ఆలయంలో పూజ చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఇక, పవన్ పర్యటన నేపథ్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో బాలుడి ఇంటి దగ్గరికి చేరుకున్నారు. కాగా, నిరంజన్‌కు చిన్నప్పటి నుంచి పవన్ అంటే ప్రత్యేక అభిమానం. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అతడు తన అభిమాన హీరో మిగతా2లో...

# నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

- పెమ్మసానితో కలసి పూజ చేసిన లోకేశ్
- రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీ నిర్మాణం



**గుంటూరు,జూన్ 17 నేటి ప్రగతి:** నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. నంబూరు-మంగళగిరి సెక్షన్ మార్గంలో మంగళగిరి-నిడమర్రు మార్గంలో 14వ నెంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులకు ఈ ఉదయం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మంగళగిరి-నిడమర్రు రోడ్డు వద్దకు చేరుకున్న మంత్రి లోకేష్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌లకు పార్టీ నాయకులు, మిగతా2లో...



# టెలిగ్రామ్ యాప్ నిషేధం బుర్రతక్కువ పని

**కేంద్రం తీరుపై మండిపడ్డ రాహుల్, కేజ్రీవాల్**

**న్యూఢిల్లీ, జూన్ 17,రిపబ్లిక్ న్యూస్ :** నీట్-యూజీ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా నిషేధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వివాదాన్ని రేకెత్తించింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా ప్రతిపక్ష నాయకులు ఈ చర్యను తీవ్రంగా విమర్శించారు. 'ఈ చర్య నిజంగా పేపర్ లీక్‌లను నిరోధిస్తుందా' అని వారు సందేహాలు వ్యక్తం చేశారు. మిగతా2లో...

# టూరిజం ప్రమోషన్ కోసమే బీచ్ సాక్స్ పాలసీ

- ఒక్క ఎపిలోనే ఇది ప్రారంభించడం లేదు
- ప్రజలకు ఇబ్బంది లేకుండా దీనిని అమలు చేస్తాం
- వైసీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు
- ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



**విశాఖపట్నం, జూన్ 17,రిపబ్లిక్ న్యూస్** బీచ్ సాక్స్ పాలసీ ఒక్క మన రాష్ట్రంలోనే లేదని ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టూరిజం ప్రమోషన్‌లో భాగంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా దీనిని తీసుకొస్తున్నామని వివరించారు. దీనిని విశాఖపట్నం, బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌లలో పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకొస్తున్నామన్నారు. ఆల్కహాల్ మిగతా2లో...


2లో

**యోగాంధ్రలో హోంమంత్రి ఆసనాలు**

# మహిళల పట్ల వైసిపికి గౌరవం లేదు

- అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిత్వ హననం
- జగన్, వైసిపి తీరుపై మండిపడ్డ మంత్రి గొట్టిపాటి


2లో

# హర్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

(మొదటి పేజీ తరువాయి)

వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనేందుకు కృషి చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురి నేతల మధ్య కీలక సంభాషణ జరిగింది. ట్రంప్‌తో ప్రధాని మోదీ ఇలా అన్నారు.. 'ప్రపంచానికి హోర్ముజ్‌ను తెరవడం అత్యవసరం. సముద్రయాన స్వేచ్ఛను కచ్చితంగా కాపాడాలని.. దానిపై మనం ప్రత్యేక దృష్టి సారించాలని మేము ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. సముద్ర వాణిజ్య రంగంలో లక్షలాది మంది భారతీయ నావికులు ప్రపంచవ్యాప్తంగా వివిధ సముద్రాల్లో విధుల్లో ఉన్నారు. ఇది చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను? ఒప్పందంలో నావికుల భద్రతకు భరోసా లభిస్తుందని.. వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని నాకు నమ్మకం ఉందని అన్నారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. 'ఫ్రాన్స్‌లో మాకు కొన్ని అద్భుతమైన సమావేశాలు జరిగాయి. ముఖ్యంగా భారత ప్రధాని మోడీతో చాలా మంచి చర్చలు జరిగాయి. మేము వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాం. అమెరికా-భారతదేశం మధ్య చాలా విషయాలు జరుగుతున్నాయి. అమెరికా అత్యుత్తమ స్థితిలో ఉంది. మా ఆర్థిక వ్యవస్థ 19.2 ట్రిలియన్ డాలర్లకు పైగా స్థాయికి చేరుకుంది. మేము కర్మాగారాలను, మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం. ప్రధాని మోడీ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. అక్కడ చాలా ఖర్చు చేస్తున్నారు. ఆ కృషిని మేము అభినందిస్తున్నాం. మోడీ నాకు చాలా కాలంగా మిత్రుడు. మా మధ్య ఎప్పుడూ గొప్ప సంబంధం ఉంది. మీతో కలిసి ఉండటం చాలా సంతోషంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. నాకు భారతదేశం పట్ల చాలా గౌరవం ఉంది. మోడీ ఉన్నంతకాలం భారతదేశం పోషించాల్సిన పాత్ర చాలా ఉంది. మోడీ ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తారు. కానీ చాలా గట్టి మనిషి అంటూ అభినందించారు.

# వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

(మొదటి పేజీ తరువాయి)



పవన్ కల్యాణ్‌ను కలవాలన్న కోరికను కుటుంబసభ్యులతో వెలిబుచ్చాడు. ఈ విషయం పవన్ వరకు వెళ్లింది. ఆయన తన అభిమాని కోసం హనుమకొండకు వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన అభిమానిని కలిశారు. అతడికి చెప్పలేనంత సంతోషాన్ని అందించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్.. ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఈరోజు హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించాను. అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో అతడి అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు స్ఫూర్తిదాయకం. తీవ్రమైన అనారోగ్య సమస్యల మధ్య నిరంజన్ చూపుతున్న మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకోవాలి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. అదే సమయంలో వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపించి దాన్ని పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవాళ్లమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నేతలకు సూచించారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

# నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. మంగళగిరి నుంచి రాజధాని అమరావతికి, తాడికొండ నియోజకవర్గానికి అనుసంధానంగా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీని నిర్మించనున్నారు. దశాబ్దాలుగా ఈ మార్గం లో రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో మంత్రి లోకేష్ చొరవ తీసుకుని రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి మంజూరు చేయించారు. సమస్య శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరుకు కృషిచేశారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే నిడమర్రు, మంగళగిరి, తాడికొండ, అమరావతి ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయి. ప్రజా రాజధాని అమరావతికి సులభమైన, నిరంతరాయ రవాణ అనుసంధానాన్ని కల్పిస్తుంది. మంగళగిరి, అమరావతి మధ్య ప్రయాణ దూరం తగ్గుతుంది. మంగళగిరి పట్టణం నుంచి మంగళగిరి నియోజకవర్గంలోని బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నీరుకొండ గ్రామాల ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. భవిష్యత్ లో ఈ ప్రాంతంలో పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. రైల్వే క్రాసింగ్ గేటు ద్వారా రోజుకు సుమారు 60 రైళ్లు ప్రయాణిస్తాయి. రోజుకు రహదారి రాకపోకల కోసం గేటు మూసివేసే సగటు వ్యవధి 8 నుంచి 10 గంటలుగా ఉంది. లెవల్ క్రాసింగ్ గేటు మూసివేసిన సమయంలో ప్రయాణీకులు దాటేందుకు 10 నుంచి 15 నిమిషాల సమయం పట్టేది. ఆర్వోబీ నిర్మాణంతో సుమారు నిమిషంలోనే దాటే అవకాశం ఉంది. నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ రైల్వే లైన్ పై 10 మీటర్ల ఎత్తులో నిర్మించనున్నారు. దీని పొడవు 767.50 మీటర్లు. ఇందులో రైల్వే లైన్ నుంచి అమరావతి వైపు 362 మీటర్లు, మంగళగిరి వైపు 405.50 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. వంతెనపై నాలుగు లైన్లు రహదారి ఏర్పాటుచేయనున్నారు. ప్రతి లైను 3.75 మీటర్లు కాగా మొత్తం క్యారేజ్ వే వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. అదనంగా 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాష్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్లు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు 5.5 మీటర్ల వెడల్పుతో ఏర్పాటుచేయనున్నారు. సర్వీస్ రోడ్లతో సహా ఆర్వోబీ మొత్తం వెడల్పు 28 మీటర్లు ఉండనుంది. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద ప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహిళల పట్ల వైసిపికి గౌరవం లేదు

**అమరావతి,జూన్ 17,రిపబ్లిక్ న్యూస్ :** మహిళల పట్ల జగన్‌కు, గొడ్డలి పార్టీ నేతలకు ఉన్న గౌరవం ఏపాటిదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. హోం మంత్రి అనితను రాజకీయంగా ఎదుర్కోలేకే వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీపై గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆ నేతల బూతులు ప్రజలు వినలేకపోయారని అన్నారు. గత రెండేళ్ల నుంచి రాష్ట్రంలో బూతుల గోల లేదని, ప్రజలు ప్రశాంతంగా ఉంటే ఉనికి చాటుకునేందుకు గొడ్డలి పార్టీ నేతలు యత్నిస్తున్నారని మండిపడ్డారు. మహిళల్ని కించపరిచేలా ఎవరు మాట్లాడినా ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా మారడం లేదని, ఇంగితం లేకుండా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. మహిళలపై ద్వేషంతోనే వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మహిళల పట్ల చులకనగా మాట్లాడే నేతలకు ఈ సమాజంలో స్థానం లేదని గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ డీఎన్ఏ అని రాజ్యసభ సభ్యులు సానా సతీశ్ వ్యాఖ్యానించారు. తన రాజకీయ పబ్బం కోసం జగన్ కాపులను బలిపశువుల్ని చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. అన్నివర్గాల ప్రజలు.. జగన్ కుట్రలను తిరస్కరించి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేసినా మళ్లీ కులాల మధ్య చిచ్చుకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. జగన్ కుల చిచ్చులో భాగంగానే గుడివాడ అమర్‌నాథ్ దిగజారేలా హోం మంత్రి అనితపై విమర్శలు చేశారన్నారు. మహిళలంటే జగన్‌కు మొదటి నుంచీ ద్వేషమని.. కన్న తల్లి, సొంత చెల్లిని గెంటేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. గుడివాడ అమర్‌నాథ్ బేషరతుగా హోంమంత్రి అనితకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల వైసీపీ నేతల చిన్నచూపుకు ఇది నిదర్శనమమని సతీశ్ అన్నారు. అహంకారంతో మహిళలను అవమానిస్తే సహించబోమన్నారు. మహిళల పట్ల గొడ్డలి పార్టీ వైఖరి ఇలాగే ఉంటే 2029లో ఆ 11 సీట్లు కూడా రావన్నారు. కష్టపడి స్వశక్తితో ఉన్నత స్థానానికి చేరుకున్న అనిత పట్ల ఇటువంటి వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు.

## యోగాంధ్రలో హోంమంత్రి ఆసనాలు



**అనకాపల్లి, జూన్ 17,రిపబ్లిక్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హోం మంత్రి, ఎంపీ, అధికారులు యోగాసనాలను వేశారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో అవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి ప్రధాన ఈవెంట్‌గా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. అలాగే యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం పేర్కొన్నారు. ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆయుష్ శాఖ అధికారులు, అలాగే ప్రకృతి వైద్యం, యోగా సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు పాల్గొన్నారు. వారు యోగా కార్యక్రమాల అమలు, ప్రజల భాగస్వామ్యం పెంపుపై ఈ సమావేశంలో చర్చించారు.

# సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేడాది చివరి నాటికి దేశం లో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# ఎపిలో విస్తరించిన ద్రోణి

(మొదటి పేజీ తరువాయి)

ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపింది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. కోస్తాంధ్ర జిల్లాలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తుందని సూచించింది. బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు అవకాశం ఉందని వివరించింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుందని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని ప్రజలకు స్పష్టం చేసింది. అలాగే తెగిపోయిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేసింది. ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని రైతులు, కూలీలు, పశువుల కాపరులకు విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోద య్యాయని వివరించింది. విజయనగరం జిల్లా వేపాడలో అత్యధికంగా 96.7 మిల్లీమీటర్లు, అనకా పల్లి జిల్లా దేవరాపల్లిలో 72 మి.మీ, శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నంలో 69.01 మి.మీ, నర్సీపట్నంలో 66.5 మి.మీ., వజ్రపు కొత్తూరులో 65.8 మి.మీ., నంద్యాల జిల్లా టంగుటూరులో 64.4 మి.మీ., అనకాపల్లి జిల్లా బలిఘట్టం, రావికమతంలో 57.7 మి.మీ., శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో 45.2 మి.మీ. వర్షపాతం నమోదైందని వివరించింది. వాతావరణ హెచ్చరికలను గమనించి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. వర్షాలు, పిడుగుల నేపథ్యంలో అవసరమైతే మాత్రమే బయటకు రావాలని ప్రజలకు ఆ సంస్థ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# టెలిగ్రామ్ యాప్ నిషేధం బుర్రతక్కువ పని

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షా పేపర్ లీక్‌లను అరికట్టడంలో విఫలమైన ప్రభుత్వం విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు 'పేపర్ లీక్ మాఫియాపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, టెలిగ్రామ్‌ను నిషేధించారు. ఇది సమస్యకు పరిష్కారం కాదు. దొంగలను పట్టుకోలేక, బాధితుల తలుపులకు తాళం వేస్తున్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఏళ్లుగా టెలిగ్రామ్‌ను ఉపయోగిం చుకుని నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, డిస్కషన్‌లతో చదువుకుంటున్నారు. ఆ సౌకర్యాన్ని లాక్కోవడం పేపర్ లీక్‌లకు పరిష్కారం ఎలా అవుతుంది' అని సోషల్ మీడియా ద్వారా రాహుల్ విమర్శించారు. అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ అంశంపై స్పందించారు. 'ఈ రోజు టెలిగ్రామ్‌ను నిషేధించారు. రేపు వాట్సాప్‌ను కూడా నిషేధిస్తారా?' అంటూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నించారు. మరోవైపు ఈ నిషేధాన్ని సవాలు చేస్తూ టెలిగ్రామ్, ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ కూడా ఈ చర్యపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది 15 కోట్లకు పైగా భారతీయ వినియోగదారులను శిక్షించడమే. ఈ చర్య అసలు లీక్‌లను ఆపదు' అని వ్యాఖ్యానించారు.

# టూరిజం ప్రమోషన్ కోసమే బీచ్ సాక్స్ పాలసీ

(మొదటి పేజీ తరువాయి)

మోతాదు తక్కువ ఉండే మద్యం ఇక్కడ ఉంటుందని వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖలతో చర్చించి.. వీటిని ఏర్పాటు చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ఇకపోతే వైసీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బుధవారం విశాఖపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. మచిలీపట్నంలో బియ్యం దొంగ పేర్ని నానికి వయస్సు పెరిగింది కానీ జ్ఞానం పెరగలేదన్నారు. తమ నాయకుడు, మంత్రి లోకేశ్ వ్యాఖ్యలను పేర్ని నాని వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఫ్యామిలీని విమర్శించినట్లు దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. గతంలో ఎన్టీఆర్ కుమార్తె భువనమ్మ, టీడీపీ అధినేత చంద్రబాబు మీద వైసీపీ నాయకులు వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో మహిళల రక్షణ, శాంతి భద్రతల కోసం కష్టపడుతున్న హోం మంత్రి వంగల పూడి అనితపై వైసీపీ నేత వ్యాఖ్యలు చేయడం దారుణమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గౌతు లచ్చన్న మనవరాలు ఎమ్మెల్యే గౌతు శిరీషపై చేసిన వ్యాఖ్యలు మరచి పోతామా? అన్నారు. రాజధాని అమరావతి కోసం పోరాటం చేసిన మహిళలను ఎంతో కించపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ తన సొంత తోబుట్టువుపై నీచంగా మాట్లాడారని గుర్తు చేశారు. సొంత బాబాయినీ గొడ్డలి పోటు వేసి.. ఆయన కుమార్తె వైఎస్ సునీతపై నీచంగా మాట్లాడారని తెలిపారు. ఇదేనా మహిళలపై మీకున్న గౌరవం అని వైసీపీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. వీటిని రాష్ట్ర ప్రజలు మర్చిపోరన్నారు. వైసీపీ నేతల మాటలే వారికి సమాధి రాళ్లు అని అభివర్ణించారు.

# పుల్లంపేటలో సీఐ కార్యాలయం ప్రారంభం.

**రైల్వే కోడూరు జూన్ 17 రిపబ్లిక్ న్యూస్.**

రైల్వే కోడూరు నియోజకవర్గం మండల కేంద్రం పుల్లంపేటలో సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం నూతనంగా బుధవారం ప్రారంభించడం జరిగినది, ఈ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ, రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని పుల్లంపేట, చిట్వేలు, ఓబులవారిపల్లి, పెనగలూరు మండలాల ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుల్లంపేటలో సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అణువుగా పుల్లంపేట ఉంటుందని ఇక్కడ సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తే అన్ని మండలాలకు అనువుగా ఉంటుందని ప్రజలు సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయానికి వచ్చి వెళ్లడానికి అనువుగా ఉంటుందని ఈ మండలంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఇప్పటి వరకు ఈ నాలుగు మండలాల ప్రజలు



పోలీసు శాఖకు సంబంధించిన వివిధ అవసరాల కోసం రైల్వే కోడూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం వెళ్ళవలసి వచ్చేదని పెనగలూరు చిట్వేలి పుల్లంపేట ప్రజలకు దూరముగా ఉన్నందువలన కోడూరు అనువైన ప్రాంతం కాదని అధికారులు తెలుసుకొని పుల్లంపేట కేంద్రముగా ఉంటే అన్ని మండలాల ప్రజలకు అనువుగా ఉంటుందని పుల్లంపేటలో అన్ని మండల ప్రజలకు ఈ కార్యాలయం ద్వారా ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన పోలీసు సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, పుల్లంపేట సీఐ శ్రీనివాసులు, ఓబులవారిపల్లి ఎస్ఐ సుజన్ కుమార్, పుల్లంపేట ఎస్ఐ చిన్నరెడ్డప్ప, చిట్వేలు ఎస్ఐ వినోద్ కుమార్, పెనగలూరు ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, ఓబులవారిపల్లి ఏఎస్ఐ వెంకటరమణతో పాటు నాలుగు పోలీస్ స్టేషన్లకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ప్రజలు పుల్లంపేట లో ప్రారంభించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ సేవలను అందిపుచ్చుకోవాలని సూచించారు

## సజ్జలను మర్యాదపూర్వకంగా కలిసిన తల్లెం.

**రైల్వే కోడూరు జూన్ 17 రిపబ్లిక్ న్యూస్.**





రాష్ట్ర వైఎస్ఆర్సిపి పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన కార్యాలయంలో బుధవారం రాయలసీమ వైఎస్ఆర్సిపి బూత్ కమిటీ కన్వీనర్, గుంతకల్లు రైల్వే డిఆర్సిసి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి బిలేటెడ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు, అనంతరం వారు ఇరువురు రాష్ట్రంలో జరుగుతున్న సర్ ప్రక్రియ గురించి చర్చించుకున్నట్లు తల్లెం తెలియజేశారు అలాగే రైల్వేకోడూరు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి నాయకుల మధ్య సమన్వయం గ్రామస్థాయి నుండి కార్యకర్తలను బలోపేతం చేయడం గురించి చర్చించుకున్నట్లు తెలిపారు ఆయనతోపాటు సజ్జలను పలువురు ఎంపీటీసీ సర్పంచులు కార్యకర్తలు కలిసినట్లు ఆయన తెలియజేశారు. ఈ రోజు ఉదయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి గారిని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి బిలేటెడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, అనంతరం ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న సర్ ప్రక్రియ గురించి చర్చించిన గుంతకల్లు రైల్వే డి ఆర్ సి సి సభ్యులు, రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి.

## గుత్తి యువ క్రికెటర్ సమీర్‌కు జిల్లా జట్టులో స్థానం

**అనంతపురం/గుత్తి, జూన్ 17: (రిపబ్లిక్ న్యూస్):**



గుత్తి పట్టణానికి చెందిన యువ క్రికెటర్ సమీర్ అండర్-16 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన సమీర్‌కు జట్టులో స్థానం లభించింది. చిన్న వయస్సు నుంచే క్రికెట్‌పై ఆసక్తి కనబరుస్తూ క్రమం తప్పకుండా సాధన చేస్తున్న సమీర్, తన ప్రతిభతో ఎంపికదారులను ఆకట్టుకుని జిల్లా జట్టులో చోటు సంపాదించాడు. సమీర్ ఎంపిక పట్ల కుటుంబ సభ్యులు, కోచ్‌లు, మగి, మిత్రులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి గుత్తి పట్టణానికి మరింత పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో 'నెక్స్ట్ జెన్ ఈ-హాస్పిటల్'పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం

**పీజీ వైద్య విద్యార్థులు, నోడల్ అధికారులకు డిజిటల్ వైద్య సేవలపై శిక్షణ**

**రోగులకు వేగవంతమైన, పారదర్శక సేవలే లక్ష్యం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 17)**కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య సేవలను మరింత ఆధునికీకరించే దిశగా 'నెక్స్ట్ జెన్ ఈ-హాస్పిటల్' విధానంపై పీజీ వైద్య విద్యార్థులు మరియు డిపార్ట్మెంట్ వైస్ నోడల్ అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆసుపత్రి ఆవరణలోని ధన్వంతరి హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఆసుపత్రి సేవలను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కేస్ షీట్లు, ల్యాబ్ రిపోర్టులు, రోగుల వివరాల నమోదు వంటి ప్రక్రియలను డిజిటల్ విధానంలో నిర్వహించడం ద్వారా వైద్య సేవల్లో జాప్యాన్ని తగ్గించడంతో పాటు పారదర్శకతను పెంచవచ్చని తెలిపారు. పీజీ విద్యార్థులు, నోడల్ అధికారులు ఈ-హాస్పిటల్ విధానంపై పూర్తి అవగాహన పెంపొందించుకుని రోగులకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందించాలని సూచించారు.

కార్యక్రమంలో ఏఆర్ఎంఓ లు డాక్టర్ సునీల్ ప్రశాంత్, డాక్టర్ క్లింటన్, నెక్స్ట్ జెన్ ఈ-హాస్పిటల్ ఎన్ఐసి రోల్ అవుట్ మేనేజర్ జె. సురేష్ బాబు పాల్గొని ఈ విధానం అమలు, ప్రయోజనాలపై వివరించారు. పెద్ద సంఖ్యలో పీజీ వైద్య విద్యార్థులు హాజరై అవగాహన పొందారు.

## హోంగార్డులకు హెల్త్ ఇన్సూరెన్స్‌పై అవగాహన కార్యక్రమం

**ఆరోగ్య భద్రతకు బీమా అవసరం - హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 17)** కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో హోంగార్డ్స్ పరేడ్ మరియు దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 70 మంది హోంగార్డులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ మాట్లాడుతూ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు, వాటి ప్రయోజనాలు, ఆరోగ్య భద్రత కోసం బీమా ప్రాముఖ్యతపై హోంగార్డులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో అనుకోని ఆరోగ్య సమస్యల సమయంలో బీమా ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్, ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొని హెల్త్ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన వివిధ అంశాలను హోంగార్డులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం హోంగార్డుల్లో ఆరోగ్య భద్రత పట్ల చైతన్యం పెంపొందించడంలో ఉపయోగపడిందని అధికారులు తెలిపారు.

## మెదక్ జిల్లా యంత్రాంగం అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారు.

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 17 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

మెదక్ జిల్లా కలెక్టరేట్ సిబ్బంది డి పి ఆర్ ఓ తన ఒక హోదాలో ఉండి ఒక రాజకీయ పార్టీ కి సపోర్ట్ గా వార్త ప్రచురణలు ఇవ్వడం ఎంతవరకు సమంజసం. దీని వెనకాల ఎవరున్నారనేది గుసగుసలు వినబడుతున్నాయి. ఒక ప్రజా ప్రతినిధిగా ఉండి జిల్లా డిపిఆర్ఓ గ్రూపులో ఇస్తున్న వార్తలు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కీ అనుగుణంగా ఇవ్వడం వెనకాల ఏమి అంతర్యం ఉందని ప్రజల విమర్శలు. ప్రజా సమస్యల పైన స్పందిస్తూ ప్రజలకు అండ దండలుగా ఉండాల్సిన ఒక ప్రజా ప్రతినిధిగా విధులు నిర్వహిస్తూ ఒక రాజకీయ పార్టీ నాయకునికి అనుకూలంగా వార్తా ప్రచురణ చేయడం ఎంతవరకు సమంజసం అంటే దీన్నిబట్టి నేరుగా డి పి ఆర్ ఓ గ్రూప్లో ఒక రాజకీయ పార్టీకి ఎమ్మెల్యేకు అనుకూలంగా పెట్టడం దీని వెనకాల ఎమ్మెల్యేకు డిపిఆర్ఓ ఏదో ఒక సంబంధం ఉన్నాయి అనే సందర్భం నిలబడుతున్నయి వెంటనే డిపిఆర్ఓ ను తొలగిస్తేనే మెదక్ జిల్లాలో సమస్యలు లేకుండా జిల్లా యంత్రాంగం ఉంటుందని ప్రజల వినికిడి

## ఘనంగా అసోసియేషన్ వార్షికోత్సవ వేడుకలు

**అనంతపురం రూరల్, జూన్ 17,(రిపబ్లిక్ న్యూస్):**

అనంతపురం డిస్ట్రిక్ట్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏడీపీడబ్ల్యూఏ) 6వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం రుద్రంపేట బైపాస్‌లోని హోసన్నా మందిరంలో ఘనంగా నిర్వహించారు. పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పాస్టర్ వి. మనష్షే ప్రార్థనతో ప్రారంభించారు. దైవ సేవకులు గీతాలాపనతో దేవునికి స్తుతులు అర్పించగా, ఆశేర్ సునీల్ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫస్ట్ బాప్టిస్ట్ ఇండిపెండెంట్ చర్చ్, చిక్‌బళ్లాపూర్‌కు చెందిన రెవ. డాక్టర్ కె.వి. ఆల్బర్ట్ పాల్గొన్నారు.

**పాడైన జీవితాలకు ఆధ్యాత్మిక మార్గదర్శనం అవసరం**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు సహవాసం వల్ల దారి తప్పిన వారిని దేవుని సేవకులుగా వెలుగులోకి నడిపించడమే సేవకుల బాధ్యత అని పేర్కొన్నారు. ఐటిబీసీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు రెవ. సుందర్‌రాజు మాట్లాడుతూ ఆత్మల సంపాదనలో జాలరి ఓర్పు, సైనికుడి సిద్ధపాటు, రైతు కష్టపడే తత్వం అవసరమని వివరించారు.

టీడీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఈటెల స్వామిదాసు మాట్లాడుతూ ప్రార్థనా మందిరాల



నిర్మాణం, మరమ్మతులు, యెరూషలేము యాత్రలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందని తెలిపారు.

**మందిర నిర్మాణ పనుల కోసం రూ.10,650 విరాళం**

రాయదుర్గానికి చెందిన సేవకుడు సురేష్ మందిర నిర్మాణ పనుల పూర్తి కోసం అసోసియేషన్ తరఫున రూ.10,650 విరాళం అందజేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రెవ. డాక్టర్ బందెల రాజు, గాడ్స్ గ్రేస్ మినిస్ట్రీ అధ్యక్షుడు రెవ. బెంజమిన్, సామాజికవేత్త చల్లా కిషోర్ చౌదరి, వైఎస్సార్‌సీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు వై.పీ. బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు థామస్‌రాజు, తాడిపత్రి పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ జాషువా, పుట్టపర్తి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు





విశ్వాస్, ఏఐసీసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రెవ. విజయ కుమారి, ఏటీఓ ఎస్తేరు రాణి, స్థానిక సంఘకాపరి డానియల్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అతిథులు, కమిటీ సభ్యులు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ముఖ్య అతిథులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. దైవ సన్నిధిలో ప్రేమ విందుతో కార్యక్రమం అత్యంత వైభవంగా ముగిసింది.

## ఏ సమస్య వచ్చినా ఏపీడబ్ల్యూజేఎఫ్ ముందుంటుంది

**ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులుద - పుట్టపర్తి నియోజకవర్గ నూతన కమిటి ఎంపిక**

**జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు, ఇళ్లు నిర్మించాలని డిమాండ్**

**శ్రీ సత్యసాయి ప్రతినిధి, జూన్17,(రిపబ్లిక్ న్యూస్):**

జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏపిడబ్ల్యూజేఎఫ్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ముందుంటుందని.. జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు అన్నారు.

**జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి**

పుట్టపర్తి నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏపిడబ్ల్యూజేఎఫ్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పుట్టపర్తిలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు హాజరయ్యారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు షఫీ, ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా రంగప్ప(అనంతభూమి) అధ్యక్షుడిగా చలపతి(ఈజ), ప్రధాన కార్యదర్శిగా టీ.సీ.గంగాధర్(సీమ వార్త), ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు(ప్రజాశక్తి), సహాయ కార్యదర్శులుగా కల్లూరి ప్రసాద్, బసప్ప(ప్రజాశక్తి), కోశాధికారిగా శ్రీరాములు (పుట్టపర్తి సమాచార్), కార్యవర్గ సభ్యులుగా ఆంజనేయులు(గీతాంజలి), గంగాధర్ (స్వతంత్ర), అనార్, మోహన్ కుమార్



నాయుడు, నారాయణస్వామిలుగా ఎంపిక చేశారు.

**అధికారంలో ఉన్న వారు హామీలు అమలు చేయడం లేదు**

ఈ సందర్భంగా రేపటి రామాంజినేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ఏపీడబ్ల్యూజేఎఫ్ విస్తృతంగా పోరాడుతోందన్నారు. ప్రధానంగా జర్నలిస్టుల సంక్షేమంతో పాటు రక్షణ కూడా ఉండాలన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించే విధంగా అధికారులకు వినతిపత్రం అందజేశామని, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియం చెల్లింపు అంశం కూడా కొందరితో మాట్లాడుతున్నామన్నారు. అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలంతో పాటు ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా అధికారంలో ఉన్న వారు హామీలు ఇస్తున్నారు తప్ప అమలు చేయడం లేదన్నారు. దీనిపై ఏపీ డబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని రామాంజినేయులు స్పష్టం చేశారు. ఈ సమావేశం లో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు డా. ఆర్కే, సూర్య, సంతోష్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, శివ రామ కృష్ణ, చక్రపాణి, బాబ్జాన్, రాజేష్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీని వెంటనే కనుగొనాలి

**: నంది విజయలక్ష్మి**

**మహిళలు, చిన్నారుల మిస్సింగ్ కేసుల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శ**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 17)**

మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి విమర్శించారు. చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమై దాదాపు పది రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఆమె ఆచూకీ లభించకపోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.

విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళా హోంమంత్రి ఉన్నప్పటికీ మహిళలపై జరిగే నేరాలు, మిస్సింగ్ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందడం లేదన్నారు. గత ఏడాది కర్నూలు జిల్లాలో



అదృశ్యమైన భారతి కేసు ఇప్పటికీ పూర్తిగా ఛేదించలేదని, ప్రస్తుతం జ్ఞానేశ్వరి కేసులో కూడా పురోగతి కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. మిస్సింగ్ కేసుల్లో బాధిత కుటుంబాలకు భరోసా కల్పించడం, వారిని పరామర్శించడం వంటి చర్యలు కూడా కనిపించడం లేదని ఆమె ఆరోపించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింసాత్మక ఘటనలను అరికట్టడంపై దృష్టి పెట్టాల్సిన రాజకీయ నాయకులు వ్యక్తిగత విమర్శలతో కాలయాపన చేయడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని వీడి మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, మిస్సింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబాలకు అండగా నిలిచి న్యాయం చేయాలని నంది విజయలక్ష్మి డిమాండ్ చేశారు.

# గ్రామీణ యువత స్వయం ఉపాధికి కొత్త దిశగా ఆర్ఎస్ఈఎస్టీఐ కేంద్రం ప్రారంభం

**నైపుణ్యాభివృద్ధితో స్వావలంబన లక్ష్యం**

**- ఆర్ఎస్ఈఎస్టీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

**యువత, మహిళలకు ఉపాధి అవకాశాల కల్పనలో ఆర్ఎస్ఈఎస్టీఐ కీలక వేదిక**





**నంద్యాల బ్యూరో, జూన్ 17 (రిపబ్లిక్ న్యూస్):** గ్రామీణ నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఆర్ఎస్ ఈ టి ఐకీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని క్రాంతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఈటీఐశిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కర్నూల్ రీజినల్ హెడ్ డి. అనిల్ కుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని శిక్షణా సదుపాయాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆర్ఎస్ఈటిఐలో గ్రామీణ నిరుద్యోగ యువత శిక్షణ పొంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి" అని పిలుపునిచ్చారు. "ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల సహకారంతో గ్రామీణ నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా ఆర్ఎస్ఈటిఐకీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడం ద్వారా యువతను స్వయం ఉపాధి వైపు మళ్లించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకుల ఆర్థిక సహకారం మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణలను సమన్వయం చేస్తూ గ్రామీణ నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గాలను చూపడంలో ఆర్ఎస్ఈఎస్టీఐ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని అన్నారు. శిక్షణ పొందిన యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయంగా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని సూచించారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులు డా. బైరెడ్డి శబరి మాట్లాడుతూ, " ఆర్ ఎస్ ఈ టి ఐ ద్వారా గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి, బ్యాంకు రుణ సహాయంతో స్వయం ఉపాధి కల్పించడం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ ఆర్ఎస్ ఈ టి ఐ సంస్థ ద్వారా మరింత మంది యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని అన్నారు. గ్రామీణ యువతకు ఉచితంగా వృత్తి, నైపుణ్య శిక్షణ అందించి, అనంతరం బ్యాంకుల రుణ సహాయంతో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ఆర్ఎస్ఈఎస్టీఐ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలో మరింత మంది యువత, మహిళలు ఆర్థికంగా బలోపేతమై తమ కుటుంబాల అభివృద్ధికి తోడ్పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ డి. అనిల్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలోని బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధి కోసం యూనియన్ బ్యాంక్ కట్టుబడి ఉందన్నారు. నంద్యాల ఆర్ఎస్ ఈటిఐ ద్వారా రైతులు, మహిళలు, ఎస్ హెచ్ జి సభ్యులకు నైపుణ్య శిక్షణ అందించి వారిని ఆర్థికంగా స్వావలంబన చేస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ ఈటి ఐ డైరెక్టర్, బి అరుణకుమారి, శిక్షకులు, సిబ్బంది, శిక్షణార్థులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప జీవన విధానం యోగా

**: డాక్టర్ కె. చిట్టి నరసమ్మ**

**కర్నూలు మెడికల్ కాలేజీలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ముందస్తు వేడుకలు**

**వైద్యులు, విద్యార్థులు దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 17)**
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీలో ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పతంజలి యోగ సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ సహకారంతో యోగా శిక్షకులు శివరాజు ఆధ్వర్యంలో యోగా సాధన చేపట్టారు.

ఈ సందర్భంగా అదనపు వైద్య విద్యా సంచాలకులు, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధానమని అన్నారు. విద్యార్థులు ముఖ్యంగా యోగాను నిత్యం అభ్యసించడం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించి, ఉత్సాహంగా జీవించగలరని తెలిపారు.

భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు, యోగా శిక్షకులు శివరాజు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు మరియు వైద్యులు యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి యోగా సాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరాములు, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మంజుల భాయ్, డీఎస్పీ మెహబూబ్ బాషా, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షులు ఉపేంద్ర గౌడ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్, డాక్టర్ సోమశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, లెక్చరర్ సురేష్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ రామకృష్ణతో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది, యూజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగా సాధనతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది





# తుది మెరుగులు దిద్దిన తర్వాతే కాంట్రాక్టర్లకు బిల్లులు

**కమిషనర్ చల్లా ఓబులేసు**

**అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం**

**అపరిశుభ్రంగా ఉంచిన ఇద్దరు షాపుదారులకు జరిమానా ఆదేశాలు**

**నగర స్వచ్ఛతకు ప్రజల సహకారం అవసరం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 17)**
నగరంలో చేపడుతున్న రహదారులు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన తుది దశ పనులు పూర్తిస్థాయిలో పూర్తి చేసి, నాణ్యత ప్రమాణాలు పాటించిన తరువాతే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు.

టైపిస్ట్ కాలనీ, చంద్రశేఖర్ నగర్ ప్రాంతాల్లో ఇటీవల నిర్మించిన సీసీ రహదారులను, అలాగే జొహరపురంవెంకాయపల్లి బీటీ రహదారిలో కొనసాగుతున్న ప్యాచ్‌వర్క్ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా తుది మెరుగులు దిద్దడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులను పూర్తి చేయాలని సూచించారు.

సిమెంట్ రోడ్లలో జాయింట్ల వద్ద బిటుమినస్ జాయింట్ ఫిల్లర్ సీలెంట్ వేయడం, రోడ్డుడ్రైనేజీ మధ్య బెర్మ్ ప్రాంతంలో గ్రావెల్ పరచడం వంటి తుది దశ పనులు పూర్తిచేసిన తర్వాతే బిల్లుల ఫైళ్లను సమర్పించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

అంతకుముందు జొహరపురం డంప్‌యార్డ్‌లో బయో మైనింగ్ ద్వారా వెలువడిన జీర్ణమైన మట్టి, ఇన్నర్ట్ వ్యర్థాలతో చేపట్టిన రహదారి విస్తరణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పనులను సమర్థవంతంగా నిర్వహించిన ఇంజినీరింగ్ విభాగ అధికారులను అభినందించారు.

అనంతరం బళ్లారి చౌరస్తా, చెన్నమ్మ సర్కిల్, ముజఫర్‌నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్, డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయకుండా రహదారులపై చెత్త వేస్తున్న ఇద్దరు దుకాణదారులకు జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. నగర పరిశుభ్రత పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ తనిఖీల సందర్భంగా ఎంఈ మనోహర్ రెడ్డి, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జనార్ధన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, కుర్మయ్య, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ



**అనంతపురం/గుంతకల్లు, జూన్ 17: (రిపబ్లిక్ న్యూస్) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంతకల్లులోని బలిజ కళ్యాణమండపంలో మంగళవారం విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని అన్నారు. గుంతకల్లు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు నిరంతరం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. అనంతరం కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణస్వామి, జనసేన సమన్వయకర్త వాసగిరి మణికంఠ, పత్తి హిమబిందు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ సూర్యప్రతాప్, పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, రమేష్, రాజా, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలి -వ్యవసాయ కార్మిక సంఘం నేతల డిమాండ్**



**అనంతపురం/పుట్లూరు క్రైమ్, జూన్ 17,(రిపబ్లిక్ న్యూస్):** శింగనమల నియోజకవర్గం పుట్లూరు మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ కూలి పెద్దకూడాల మల్లేశ్వరి (40) అనారోగ్యంతో మృతి చెందడం అత్యంత బాధాకరమని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు అన్నారు. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. సూరి డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్లూరు మండల కేంద్రానికి చెందిన పెద్దకూడాల సుబ్బారాయుడు, మల్లేశ్వరి దంపతులు వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. మంగళవారం కూలి పనులకు వెళ్లిన మల్లేశ్వరి ఇంటికి వచ్చిన అనంతరం తీవ్ర కడుపునొప్పితో బాధపడడంతో కుటుంబ సభ్యులు ఆమెను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త సుబ్బారాయుడు, కుమారుడు, కోడలు, మనవడు ఉన్నారని, కుటుంబం పూర్తిగా కూలి పనులపైనే ఆధారపడి జీవిస్తోందని పేర్కొన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన ఈ నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకుని రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వీరితోపాటు వ్యవసాయ కార్మిక సంఘం పుట్లూరు మండల కార్యదర్శి పెద్దయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# మారెన్న మరణం వాల్మీకి సంఘానికి తీరని లోటు

**రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు వాల్మీకి బి లక్ష్మన్న.**



**మంత్రాలయం, జూన్, 17,(రిపబ్లిక్ న్యూస్ )**నియోజకవర్గం కౌతాళం మండలం నది చాగి గ్రామం లో ఎస్ మారెన్న పోస్ట్ మారన్న ఉదయం 8 గంటలకు హార్ట్ ఎటాక్ తో చనిపోవడం జరిగింది. రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు, మంత్రాలయం జనసేన పార్టీ ఇంచార్జ్, వాల్మీకి బి లక్ష్మన్న, జనసేన పార్టీ కోసిగి మండల అధ్యక్షులు సి వీరారెడ్డి, నది చాగి బసవరాజు, తెలుగుదేశం పార్టీ లీడర్ పకీరప్ప మొదలగు నాయకులు స్వర్గీయ నది చాగి మారెన్నకు శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు, జనసేన పార్టీ మంత్రాలయం నియోజకవర్గం ఇన్చార్జి వాల్మీకి బి లక్ష్మన్న మాట్లాడుతూ నది చాగి ఎస్ మారెన్న మరణం వాల్మీకి సంఘానికి తీరని లోటు అని, వాల్మీకి సంఘం స్థాపించినప్పటి నుంచి రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర నాయకులుగా ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు అని, సంఘానికి ఎంతో సేవ చేశారని స్వర్గీయ నది చాగి ఎస్ మారెన్న సేవలను కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ సంఘం తరపున మేము అండగా ఉంటామని తెలిపారు.

# విద్యా ప్రమాణాలపై హెచ్ఎంలకు ఎంఈవోల దిశానిర్దేశం



**మంత్రాలయం, జూన్, 17(,రిపబ్లిక్ న్యూస్ )**మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాధికారులు ఎన్. నాగభూషణ్, ఆర్. రాగన్న సమావేశం నిర్వహించారు. ఐదేళ్లు నిండిన పిల్లల నమోదు, బడి మానేసిన వారిని చేర్పించడం, 'యోగాంధ్ర' నమోదుపై చర్చించారు. కేజీబీవీ, రచ్చుమర్రి మోడల్ స్కూల్ విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు, చిలకలడోన, వగరూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 560 అధిక మార్కులు సాధించడంపై హెచ్ఎంలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని హెడ్మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు

# నీటి కుంటలో మునిగి యువకుడు మృతి

**సమయానికి వైద్యం అందక ప్రాణం కోల్పోయిన రాజశేఖర్**

**దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, అంబులెన్స్ లేవంటూ కుటుంబ సభ్యుల ఆవేదన**





**దేవనకొండ, జూన్ 17**
**( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**
దేవనకొండ మండల పరిధిలోని కరిడికొండ గ్రామానికి చెందిన మాదిగ కృష్ణ, లక్ష్మి దంపతుల కుమారుడు మాదిగ రాజశేఖర్ (యువకుడు) నీటి కుంటలో మునిగి మృతి చెందిన విషాద సంఘటనచోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం, కరిడికొండ గ్రామ సమీపంలోని నీటి కుంటలో ఈతకు వెళ్లిన రాజశేఖర్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి కొట్టుమిట్టాడాడు. ఇది గమనించిన గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వెంటనే స్పందించి యువకుడిని రక్షించి బయటకు తీసుకొచ్చారు. అనంతరం అతడిని అత్యవసర చికిత్స కోసం దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సరైన సమయంలో చికిత్స అందలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సమయానికి వైద్యం అందించి ఉంటే తమ కుమారుడు ప్రాణాలతో బయటపడేవాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆసుపత్రిలో 108 అంబులెన్స్ సేవ కూడా అందుబాటులో లేకపోవడంతో వేరే మార్గం లేక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు యువకుడిని ద్విచక్ర వాహనాలపై పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు సమాచారం. మృతుడు రాజశేఖర్ కుటుంబానికి ఇది రెండో విషాదమని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికే ఒక కుమారుడిని అనారోగ్యంతో కోల్పోయిన ఆ కుటుంబం, ఇప్పుడు మరో కుమారుడిని కోల్పోవడంతో తీవ్ర శోకసంద్రంలోమునిగిపోయింది. దేవనకొండ మండలంలో 44 గ్రామాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది, అత్యవసర వైద్య పరికరాలు తగినంతగా లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడంతో పాటు దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే వైద్యులు విధుల్లో నిర్లక్ష్యం వహించి ఉంటే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా రిపబ్లిక్
గురువారం 18 జూన్ 2026

# సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సీపీఐ వినతి..



**దేవనకొండ జూన్ 17( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**

మండలంలో డిఎన్టి హాస్టల్ ను పున: ప్రారంభించాలని, మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, కస్తూరిబా పాఠశాలకు సి.సి రహదారి ఏర్పాటు చేయాలని, ప్రాథమిక వైద్య కేంద్రం నందు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును భర్తీ చేయాలని రెగ్యులర్ ఫార్మాసిస్టు ని నియమించాలని అలాగే హంద్రీ-నీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర సబ్-కెనాల్ ఏర్పాటు చేసి గుడిమిరాళ్ల, చెల్లెల చెలిమల, పి. కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు నీరు మళ్లించాలని జిల్లా కలెక్టర్ డా..సిరి ని సిపిఐ మండల కార్యదర్శి ఎం నరసారావు కోరారు. బుధవారం దేవనకొండ మండలానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ను మండలంలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ పార్టీ మండల ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ మరియు ఫార్మసిస్ట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మండల కేంద్రంలోని డీఎన్‌టీ హాస్టల్‌ను పునఃప్రారంభించడంతో పాటు, మండలంలో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల సౌకర్యార్థం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి సీ.సీ రహదారి నిర్మించాలని వినతిలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలను ప్రస్తావిస్తూ, గుండ్లకొండ సమీపంలో ఉన్న హంద్రీ-నీవా ప్రధాన కాలువకు సబ్ కెనాల్ ఏర్పాటు చేసి, గుండ్లకొండ, గుడిమరాళ్ళ, చెల్లెలచలిమల,పి.కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు, రైతులకు తాగు, సాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. మండల ప్రజల సంక్షేమం, విద్య, వైద్యం మరియు వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన ఈ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని సీపీఐ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కోరడం జరిగిందన్నారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఖండప్ప, సిపిఐ మండల నాయకులు రవి, భాస్కర్, నరేష్, మద్దిలేటి, రాజశేఖర్, హరి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మనూరు మెగా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు






**అనంతపురం/గుత్తి, జూన్ 17:( రిపబ్లిక్ న్యూస్):**గుత్తి మండలం బసినేపల్లి గ్రామంలో నిర్వహించిన గుమ్మనూరు మెగా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే తనయుడు, గుత్తిపామిడి మండలాల టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన చెట్నేపల్లి క్రికెట్ జట్టుకు గుత్తి మండల బీసీ సెల్ అధ్యక్షుడు బసినేపల్లి రామాంజినేయులు రూ.30 వేల నగదు బహుమతి, ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన బసినేపల్లి క్రికెట్ జట్టుకు తలారి నాగరాజు రూ.20 వేల నగదు బహుమతి, ట్రోఫీ ప్రదానం చేశారు.ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ గుమ్మనూరు కుటుంబంపై అభిమానంతో బసినేపల్లి గ్రామంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. టోర్నమెంట్ ముగింపు వేడుకలకు హాజరై క్రీడాకారులకు బహుమతులు అందించడం మరింత సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఫైనల్ మ్యాచ్‌లో రన్నర్ గా నిలిచిన బసినేపల్లి జట్టును ఆయన ప్రోత్సహిస్తూ, ఆటల్లో గెలుపోటములు సహజమని, జట్టు సభ్యులు నిరుత్సాహపడకుండా లోపాలను సరిదిద్దుకుని రాబోయే పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ సూర్య ప్రతాప్, ఆస్పత్రి అభివృద్ధి కంపెనీ నెంబర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రామలింగమయ్య,రమేష్, గుత్తి పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సేవ టికెట్లపై అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో విచారణ



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 17 రిపబ్లిక్ న్యూస్**

మండల కేంద్రమైన చౌడేపల్లిలోని శ్రీ అభీష్టత మృతుంజేశ్వర స్వామి ఆలయంలో సేవ టికెట్లపై నెలకొని ఉన్న సమస్యపై ఎండోమెంట్ అధికారులు విచారణ చేపట్టారు బుధవారం అన్నమయ్య జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయంలో సేవా టికెట్లు విక్రయించుకునేలా సంవత్సరం నుంచి కమిషనర్ నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు అయితే వీటి విషయంపై అర్చకులు రాష్ట్ర హైకోర్టు నందు రిట్ పిటిషన్ చేశారని ఇందులో భాగంగా నివేదిక సమర్పించేందుకై కోర్టు ఆదేశాల మేరకు తాను విచారణ చేపట్టినట్లు వివరించారు దేవాదాయశాఖ కమిషనర్ సేవా టికెట్లు విక్రయించక ముందు భక్తుల నుంచి సంబంధిత నగదు అర్చకుల వ్యక్తిగత ఖాతాలోకి జమ చేసేవారని ఇకపై అలా కాకుండా ఎండోమెంట్ అధికారులు ఇచ్చిన సేవా టికెట్లను విక్రయించి దేవాదాయ శాఖ అకౌంట్లో జమ చేయాలని అన్నారు జమ అయిన నగదును అర్చకులకు జీతాల రూపంలో అందిస్తామని అది సైతం కమిషనర్ ఆదేశాలు వచ్చిన తర్వాత ఉంటుందని ఆయన వివరించారు భూ సమస్యను పరిష్కరించి తమకు అందించాలని అప్పటివరకు సేవ టికెట్లు విక్రయించరాదని అర్చకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు ఈ మేరకు వినతి పత్రం అందించాలని అధికారులు అర్చకులకు సూచించారు అనంతరం పట్టణంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని ఆక్రమిత భూములను ఆయన సందర్శించారు గోసల కురపల్లిలో గల శివాలయం నూతన నిర్మాణానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు శశికుమార్, గ్రూప్ టెంపుల్స్ ఈవో రమణ, అర్చకులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ నాయకులకు కీలక సూచనలు

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అత్యంత అప్రమత్తంగా:-ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి

**దేవనకొండ, జూన్ 17(ప్రజా రిపబ్లిక్ న్యూస్ ): -**

ఆలూరు నియోజకవర్గం దేవనకొండ మండలంలోని అలారుదిన్నె, కుంకునూరు, కొత్తపేట, కరిడికొండ, వరిముక్కల, కూకటికొండ, వెలమకూరు, సింగపురం గ్రామాల్లో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ ) సమీక్ష సమావేశంలో ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బూత్ లెవల్ ఏజెంట్లు ( బి ఎల్ ఎ లు) మరియు పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రాబోయే నాలుగు వారాలు అత్యంత కీలకమని, ಎ×= ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తే అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ప్రతి గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు రోజువారీ సమీక్షలు నిర్వహిస్తూ ఓటర్ల వివరాలను



పరిశీలించాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఓటు విలువైనదని, ఓటర్ల హక్కులను కాపాడుకోవడం ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు.గ్రామాలకు చెందిన బిఎల్ఏ లు ప్రతి ఓటరిని వ్యక్తిగతంగా సంప్రదించి, అవసరమైన పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, రాష్ట్ర మరియు జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు, బూత్ ఏజెంట్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బి ఎల్ ఎ లు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మండలంలో సాగునీటి సమస్యలు పరిష్కరించాలి..

## హంద్రీనీవాకు పంట కాల్వల నిర్మాణం చేపట్టాలి

### గుండ్లకొండ దగ్గర స్లూస్ ఏర్పాటు చేసి కోట కొండ మాచాపురం వరకు సాగునీరు ఇవ్వాలి -.సిపిఎం

**దేవనకొండ జూన్ 17 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**

దేవనకొండ మండలంలో ప్రధాన సాగునీటి సమస్యలు అయిన హంద్రీ నివా కు పంట కాలవల నిర్మాణం, గుండ్లకొండ దగ్గర స్లూయిస్ ఏర్పాటుకు ప్రభుత్వం వెంటనే కార్యాచరణ మొదలు పెట్టాలని సిపిఎం జిల్లా నాయకులు బి వీరశేఖర్ దేవనకొండ కు జిల్లా కలెక్టర్ గారు వచ్చిన సందర్భంగా వినతి పత్రం అందజేసి ఈ మేరకు కలెక్టర్ గారిని కోరారుఈ సందర్భంగా కలెక్టర్ గారికి సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్ సమస్యను వివరిస్తూ దశాబ్దల తరబడి కరువు కు పరిష్కారంగా పోరాడి సాధించుకున్న హంద్రీనీవా సుజల స్రవంతి లక్ష్యం పాలకుల చిత్తశుద్ధి లోపం వలన ప్రజలకు పూర్తిగా అందడం లేదనీ,అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు ప్రజాప్రతినిదుల నిర్లక్ష్యం,అవగాహన రాహిత్యం వలన మండల రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. మండలంలోని సాగునీట హంద్రీనీవా నుండి మండలం కు 46 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి అయితే మండలం లో ని హంద్రీనీవాకు పంట కాలువల నిర్మాణం



లేక ఇప్పటివరకు అధికారికంగా ఒక్క ఎకరా కూడా ప్రభుత్వం నీరు ఇవ్వలేదు ప్రధాన కాలువలలో పోతున్న నీటికి పైపులు వేసుకోవడం ద్వారా, మోటర్ల ద్వారా వేలకు వేల రూపాయల ఖర్చు పెట్టి రైతులు సాగునీరునుఉపయోగియించుకుంటున్నారు గత ఏడు ఎనిమిది సంవత్సరాలుగా మండల రైతాంగం, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, సిపిఎం పార్టీ పదేపదే విజ్ఞప్తి చేస్తున్నాయనీ అయినా ప్రభుత్వం, పాలకులు ఇది తమకు సంబంధంలేని వ్యవహారంగా నటిస్తున్నారని తెలిపారు ఈ నేపథ్యంలోనే పంట కాలువలు నిర్మాణం పూర్తి చేసి అదేవిధంగా కప్పట్రాళ్ల, కరివేముల ,తెర్నేకల్ గ్రామాల మధ్య పెండింగ్ లో ఉన్న ప్రధాన కాలువల పనులు పూర్తి చేయాలని కోరారు.హంద్రీనీవాకు గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ వరకు కాలువ ద్వారా సుమారు పది గ్రామాలకు సంబంధించిన పొలాలకు పదివేల ఎకరాలకు పైగా సాగునీరు అందించవచ్చు అదేవిధంగా ఆయా గ్రామాల పరిధిలోని చెరువులకు నీళ్లు మళ్లించే అవకాశం ఉంది తద్వారా గుండ్లకొండగుడిమరాళ్ల ,బంటుపల్లి, బేతపల్లి, చెలిమి చలమల, బండపల్లి, కోటకొండ, మాచాపురం, వెంకటాపురం, పల్లె దొడ్డి , బురకుంట గ్రామాలకు సాగు నీరు అందించవచ్చు అని అయితే ప్రభుత్వం పాలకులు ఈ సమస్య ఉదాసీనతో ఉందని అదేవిధంగా మండలంలోని పెద్ద చెరువులైన నేలతలమరి ,మాచాపురం చెరువులకు నీటిమళ్లింపు ప్రచారానికే పరిమితం అవుతున్నాయనీ ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యూసుఫ్, భాష,అశోక్ ,నాగేంద్ర రంగస్వామి తదితరులు పాల్గొన్నారు

# ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యం

**: కలెక్టర్ డా. ఏ.సిరి**

**హై-డెన్సిటీ మామిడి తోటలతో ఉత్పత్తి పెంపు**

**అంతర పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం**

**దేవనకొండలో నమూనా తోటల పరిశీలన**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 17)**

ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను రైతులు విస్తృతంగా అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు, అధిక ఆదాయం సాధించవచ్చని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి తెలిపారు. దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో రైతు సదాశివరావు సాగు చేస్తున్న హై-డెన్సిటీ మామిడి తోటను పరిశీలించిన కలెక్టర్, తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు నాటే ఈ విధానం ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు.

ఎకరాకు 210 నుంచి 260 మామిడి మొక్కలు నాటి, మైక్రో ఇరిగేషన్ సదుపాయాలతో సాగు చేస్తున్న ఈ తోట రైతులకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. హార్టికల్చర్, ఏపీఎంఐపీ, ఎన్ఆర్ఈజీఎస్ శాఖలు సమన్వయంతో రైతులకు శిక్షణలు, సాంకేతిక మార్గదర్శకత్వం అందించి జిల్లాలో పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంచాలని అధికారులకు సూచించారు.

హై-డెన్సిటీ మామిడి సాగుకు ప్రభుత్వం ఎకరాకు రూ.20



వేల సబ్సిడీ అందిస్తోందని, డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ యంత్రాలపై కూడా రాయితీలు లభిస్తున్నాయని రైతు సదాశివరావు తెలిపారు. తన 7 ఎకరాల మామిడి తోట ద్వారా ఈ ఏడాది మొదటి పంట నుంచే రూ.7 లక్షల ఆదాయం లభించిందని వివరించారు.

అనంతరం దేవనకొండలో రైతులు సాగు చేస్తున్న హైబ్రిడ్ కొబ్బరి తోటలను పరిశీలించిన కలెక్టర్, కొబ్బరి తోటల్లో టమాటా, వేరుశనగ, గోరుచిక్కుడు వంటి అంతర పంటలు సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. శాశ్వత పంటలతో పాటు అంతర పంటల సాగు రైతుల నిర్వహణ ఖర్చులను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

రైతుల ఆదాయ పెంపు, భూమి వినియోగ సామర్థ్య





మెరుగుదల, స్థిరమైన వ్యవసాయాభివృద్ధి కోసం ఉద్యాన పంటలతో పాటు అంతర పంటల సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఏడాది తర్వాత కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం

**గోవింద నామస్మరణతో మార్మోగిన గూగూడు -భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం**





**అనంతపురం/నార్పల సంక్షేమం,జూన్ 17,(రిపబ్లిక్ న్యూస్ ):**

అనంతపురం జిల్లా నార్పల మండలం గూగూడు గ్రామంలో వెలసిన శ్రీ కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏడాది తర్వాత ప్రథమ దర్శనం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది. “శ్రీ కుళ్లాయిస్వామి గోవిందా.. గోవిందా“ అంటూ భక్తుల నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లా సహా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రథమ దర్శనం లభించడం తమకు పుణ్యఫలంగా భావిస్తున్నామని, స్వామివారి దర్శనంతో జన్మ ధన్యమైందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గూగూడు గ్రామ పురవీధులు భక్తులతో కళకళలాడాయి. భక్తుల రాకతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక శోభతో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

# టీ.వై.జె.ఎఫ్ ( టీ వై జె ఎఫ్ )యూనియన్ అందోల్ నియోజకవర్గశీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 17 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీ.వై.జె.ఎఫ్) యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తనుగుల జితేందర్ రావు ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో అందోల్ నియోజకవర్గశీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.నూతన కమిటీలో జోగ్యల్ల రాజు అధ్యక్షుడిగా, జెల్ల భాగయ్య ప్రధాన కార్యదర్శిగా, మాదిగ బుచ్చయ్య ఉపాధ్యక్షుడిగా, మదారి నాగరాజు కోశాధికారిగా, డాకూరి సుకుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.నూతన బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, టీ.వై.జె.ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.ం

## అందోల్ జోగిపేట్ కు నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్సై గిరి శ్రీకాంత్ ను కలిసిన టి వై జె ఎఫ్ యూనియన్ సభ్యులు





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 17( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆందోల్ నియోజకవర్గం టీ వై జె ఎఫ్ అధ్యక్షులు జోగ్యల్ల రాజు ప్రధాన కార్యదర్శి జెల్ల భాగయ్య ఉపాధ్యక్షుడు మాదిగ బుచ్చయ్య కోశాధికారి మదారి నాగరాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాకూరి సుకుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న చంటి లోకల్ క్రాంతన్న...

**అందోల్ నియోజకవర్గ ప్రతినిధి**
**జూన్ 17 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**



సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మిత్రుడు చాంప్తశీని ఖబఝితీ నీ ఈరోజు జహీరాబాద్ పోలీసులు లేనిపోని లొట్టపిస్ కేసులతో అరెస్ట్ చేసి స్టేషన్ కి తీసుకుపోయినా విషయం తెలిసిన నిమిషాల్లోనే స్టేషన్ కి వెళ్ళి ఈ ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడవద్దు,అన్నిటికీ నేను ఉన్నాను ధైర్యంగా ఉండాలని చెప్పిన ఆందోల్ మాజీ మీ క్రాంతన్న...కార్యకర్తలు,సోషల్ మీడియా వారియర్స్ ఎవరు కూడా భయపడే అవసరమే లేదు మీకు అండగా నేను ఉన్నాను అని భరోసా కల్పించిన మాజీ అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ గారు..

## జోగిపేట నూతన ఎస్సై ని కలిసిన నేరేడు గుంట సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 17 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
జోగిపేటకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ ఐ శ్రీ గిరి శ్రీకాంత్ గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ సహకారం అందించాలని కోరాము.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండంద ఈశ్వర్ గారు, గ్రామ పెద్దలు వీరేశం గారు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఇరవైఏడవ సారి రక్తదానం చేసిన బీఎస్పీ నేత నిషాని

**కరీంనగర్ ప్రతినిధి జూన్ 17 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**



ఈ రోజు చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కరీంనగర్ లోని చెల్మెడ ఆనంద రావు వైద్య కళాశాలలో శస్త్ర చికిత్స కి రక్తం అవసరముండగా బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం వెళ్లి బి పాజిటివ్ రక్తం దానం చేశారు. ఈ రోజు తో ఆయన ఇరవై ఏడవ సారీ చేసినారు. 2006 నుండి క్రమం తప్పకుండా ఇస్తున్నాడు. 2009 లో వారి తల్లి తండ్రి కి రోడ్ ప్రమాదంలో గాయపడి అధిక రక్తస్రావం జరుగి తల్లి మరణించింది. అప్పటి నుండి ఎవరు కూడ రక్తం లభించక మరణించవద్దని నిషాని రామచంద్రం క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్నారు. ఇలా క్రమం తప్పకుండా చేయడం వలన పలువురు ఆదర్శం గా తీసుకుంటారని అంటున్నారు.

# యోగాంధ్ర మహా యోగా విజయవంతం చేయాలి

### : మునిసిపల్ కమిషనర్ జబ్బార్ మియా





**అనంతపురం/గుత్తి, జూన్ 17: (రిపబ్లిక్ న్యూస్):**
యోగాంధ్ర మహా యోగా కార్యక్రమంలో భాగంగా 20 న గుత్తికొండలోని గుర్రపుశాల వద్ద జరగనున్న యోగా ఉత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని గుత్తి మునిసిపల్ కమిషనర్ బి. జబ్బార్ మియా కోరారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లపై గుత్తి మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు సమన్వయంతో పనిచేసి యోగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు.
అనంతరం ఆయన మాట్లాడుతూ, చారిత్రక ప్రాధాన్యం కలిగిన గుత్తి కోటను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.
ఈ సమావేశంలో సీఐ రామారావు, డిప్యూటీ తాహసిల్దార్ సూర్యనారాయణ ఎంఈఓ రవినాయక్, మండల రెవెన్యూ శాఖ అధికారులు, మేనేజర్ రాంబాబు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల సామాజిక కార్యకర్తలు, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నీట్ కటకటలు !

**జూన్ 17,రిపబ్లిక్ న్యూస్ :**
నీట్ ఏ ముహూర్తాన ప్రవేశ పెట్టారో కానీ ఎప్పుడూ సవ్యంగా సాగడం లేదు. ఈ నెల 21 తిరిగి నీట్ నిర్వహించబోతున్నారు. ఈ క్రమంలో పరీక్షాపత్రం సిద్ధం చేసిన వారిని రహస్య ప్రాంతంలో విడిది చేయించారు. వారికి ఫోన్, టివి లాంటివి అందుబాటులో లేకుండా రహస్యంగానే ఉంచారు. గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకున్నప్పుడు ఎక్కడా లోపాలు లేవు. సాఫీగా ఎంసెట్ జరిగింది. మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు సాఫీగా సాగాయి. కానీ ఎప్పుడైతే జాతీయ స్థాయిలో నీట్ ప్రవేశ పెట్టాక గందరగోళం, పేపర్ లీక్‌లు సర్వసాధరణంగా మారింది. తాజాగా మరోమారు పేపర్ లీక్ కావడంతో ఈ నెల 21వ తేదీన తిరిగి పరీక్షను నిర్వహించబోతున్నారు. ఇప్పుడు ప్రధాని కార్యాలయం స్వయంగా పర్యవేక్షించడం చూస్తున్నాం. హెలికాప్టర్లు, విమానాలు, సిఆర్‌పిఎఫ్ బలగాల రక్షణలో పరీక్ష నిర్వహించ బోతున్నారు. నిజానికి పరీక్షకు ప్రిపేర్ అయి గతంలోనే రాసిన అనేకమంది ఇప్పుడు తమ భవిష్యత్ ఎలా ఉంటుందో అన్న గందరగోళంలో పడ్డారు. మానసికంగా వారు ఒత్తడికి గురవుతున్నారు. యూపిపిఎస్సీ పరీక్షను సక్రమంగా నిర్వహిస్తున్నప్పుడు నీట్ పరీక్షను ఎన్‌టిఎ ఎందుకు సరిగా నిర్వహించడం లేదని సుప్రీం కోర్టు గతంలోనే మొట్టి కాయలు వేసింది. నీట్ పరీక్షను పక్కాగా నిర్వహించడంలో విఫలం అయిన ఎన్‌టిఎపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్న తీరు సమస్యగా మారింది. ఇకపోతే 21న పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు నీట్–యూజీ పరీక్ష అడ్మిట్‌కార్డుల డౌన్‌లోడింగ్ ప్రక్రియలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అడ్మిట్‌కార్డులు నీట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆ పరీక్షను నిర్వహించే 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) ఆదివారం ప్రకటించగానే.. విద్యార్థులు భారీ సంఖ్యలో వెబ్‌సైట్‌ను సందర్శించారు. అయితే, పోర్టల్ తెరుచుకోవటానికి చాలా సమయం పడుతోందని, మధ్యలోనే నిలిచిపోతోందని, టైమ్‌ఔట్ ఎర్రర్స్‌ని చూపిస్తోందని అనేక మంది సోషల్ మీడియాలో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ, పరీక్షకు మళ్లీ సన్నద్ధం కావటంలో ఇప్పటికే తాము తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉంటే.. ఈ సమస్యలు ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. అడ్మిట్‌కార్డుల విషయంలో ఈ పరిస్థితి ఉంటే.. ఫీజు రిఫండ్ అంశంలోనూ




సమస్యలు తలెత్తాయని తెలిపారు. రిఫండ్ కోసం తమ బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించిన తర్వాత కూడా.. వివరాలు ఇవ్వలేదంటూ వెబ్‌సైట్‌లో కనిపించిందని పలువురు వెల్లడించారు. మరికొందరు, తమకు తెలియకుండా.. రిఫండ్ అవసరం లేదనే ఆప్షన్‌ను సెలక్ట్ చేశామని, రిఫండ్ కోసం ఈ ఆప్షన్‌ను ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించాలని ఎన్‌టీఏకు విజ్ఞప్తులు చేశారు. అడ్మిట్‌కార్డుల కోసం ప్రత్యామ్నాయ విధానాలను కూడా అందుబాటులో ఉంచాలని, బ్యాంకుఖాతాల ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయాలని పలువురు ఎన్‌టీఏకు సూచించారు. కాగా, ఈ ఫిర్యాదులపై ఎన్‌టీఏ సోమవారం స్పందిస్తూ.. విద్యార్థులు భారీ సంఖ్యలో సందర్శించటం వల్ల తమ సర్వర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటిని సరిదిద్దటానికి నిపుణులు పని చేస్తున్నారని పేర్కొంది. ఇప్పటికే 4 లక్షల మంది విద్యార్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిపింది. పేపర్ లీకేజీ, తిరిగి పరీక్ష నిర్వహణ నేపథ్యంలో నీట్ విద్యార్థులకు ఫీజును రిఫండ్ చేస్తామని ఎన్‌టీఏ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా.. ఓ సైబర్ నేరస్థుడు రిఫండ్‌ల మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించుకున్నాడు. బిహార్‌లోని గయ జిల్లాకు చెందిన 19 ఏళ్ల నవీన్ యాదవ్ అనే వ్యక్తి నీట్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 150 మంది విద్యార్థుల అకౌంట్లను హ్యాక్ చేశాడు. రిఫండ్ కోసం ఆయా విద్యార్థులు ఇచ్చిన బ్యాంకు ఖాతాల వివరాల స్థానంలో తన బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేశాడు. తద్వారా ఒక్కో విద్యార్థికి రూ.1700 చొప్పున వచ్చిన రిఫండ్ మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించాడు. దీనిపై ఓ విద్యార్థి తండ్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ సైబర్ క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేయగా.. అసలు విషయం బయటపడింది. నవీన్ యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు, నీట్ రీఎగ్జామ్ ప్రశ్నపత్రాలను అమ్ముతామంటూ విద్యార్థులు, తల్లిదండ్రులతో బేరసారాలు సాగిస్తున్న రాజస్థాన్‌కు చెందిన సుమేర్‌సింగ్ మీనా, ఆకాశ్‌మీనా అనే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. టెలిగ్రాం ఛానళ్ల ద్వారా వీరు నీట్ ప్రశ్నపత్రాల గురించి ప్రచారం చేశారని, రూ.1.5 కోట్ల మేర లావాదేవీలు జరిపారని వెల్లడైంది. ఇదిలావుంటే ఈ గందరగోళం నేపథ్యంలో ఒక పరీక్ష నిర్వణకు ఇంతగా హంగామా ఎందుకని తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు, విశ్రాంత పోలీస్ అధికారి అన్నామలై ప్రశ్నించారు. పోలీసులు, హెలికాప్టర్ల వినియోగం వంటివన్నీ చేయడం, ప్రధాని కార్యాలయం సమీక్షించడం వంటివి వైఫల్యాలను ఎత్తి చూపుతున్నాయని అన్నారు. నీట్ పరీక్ష విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాలపై సమీక్షించాలి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనుసరిస్తున్న తీరుగా పటిష్టం చేయాలి. లేదా నీట్‌ను ఎత్తివేయడం మంచిది..

------------

# గ్యాస్ వినియోగదారులకు మెలిక

## 30లోగా కెవైసీ, బయోమెట్రిక్ చేసుకోవాలి

**న్యూఢిల్లీ,జూన్ 17,రిపబ్లిక్ న్యూస్ :**
వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉజ్వల పథకం లబ్దిదారులతో పాటు సబ్సిడీ పొందుతున్న సాధారణ గ్యాస్ వినియోగదారులు కూడా జూన్ 30 లోగా తమ బయోమెట్రిక్ ప్రక్రియను కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ గడువులోగా బయోమెట్రిక్ పూర్తి చేయని వారి ఖాతాల్లో సబ్సిడీ జమ కాకుండా నిలిపివేయనున్నారు. ఏడాదిగా ఈ–కేవైసీ ప్రక్రియ కొనసాగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ నెల 30లోపు పూర్తి చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఒకవేళ జూన్ 30 గడువు దాటిన తర్వాత బయోమెట్రిక్ పూర్తి చేసుకుంటే.. ఆ తేదీ తర్వాత తీసుకునే సిలిండర్లకు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. గడువు ముగిసిన రోజు నుంచి బయోమెట్రిక్ పూర్తయ్యే మధ్య కాలంలో తీసుకునే సిలిండర్లపై సబ్సిడీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని కేంద్రం తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మే 18న జారీ చేసిన ప్రకటన ప్రకారం.. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి కాలేదనే నెపంతో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల సరఫరాను మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదు. అయితే, క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం.. బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి సిలిండర్ల



డెలివరీని ఆలస్యం చేయాలని లేదా నిలిపివేయాలని ఆయిల్ కంపెనీల నుంచి గ్యాస్ డీలర్లకు అనధికారిక ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడంతో, ఇటీవల జూన్ 7న సిలిండర్ ధరను రూ.29 మేర పెంచారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సబ్సిడీ లేని గృహోపయోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.994 పలుకుతోంది. కేంద్రం ఉజ్వల పథకం కింద ప్రతి సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ ఇస్తుండగా, మిగిలిన అర్హులైన సాధారణ వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో స్వల్ప మొత్తంలో సబ్సిడీ జమ అవుతోంది. మరోవైపు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. రాష్ట్రంలో సుమారు 1.26 లక్షలకు పైగా క్రియాశీలక గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకొని వారి వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పంచుకోనున్నాయి. గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయని వారు వెంటనే తమ పరిధిలోని గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. జూన్ 30 లోగా ఈ పని పూర్తి చేసుకుంటేనే ఎలాంటి అంతరాయం లేకుండా సబ్సిడీ డబ్బులు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయి.
గ్యాస్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు ముఖ గుర్తింపు, వేలిముద్రలు లేదా ఐరిస్ వంటి మూడు విధానాలతో ఎల్‌పీజీ వినియోగదారుల ఈ–కేవైసీని పూర్తి చేయనున్నారు. ఈ ప్రక్రియ కోసం వినియోగదారులే నేరుగా ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్ ద్వారా ఈ–కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. గ్యాస్ ఏజెన్సీల డీలర్ల వద్ద ఈ–కేవైసీ పూర్తి చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీలు గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలోనే ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నాయి.

---------------

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# ఆల్ఫా ట్రైలర్ విడుదల




యష్ రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్ఠాత్మక స్పై యూనివర్స్ నుంచి వస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం 'ఆల్ఫా' అధికారిక ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఆలియా భట్, శర్వరీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు శివ్ రావైల్ దర్శకత్వం వహించారు. బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఆల్ఫా' చిత్రం వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో వస్తున్న మొట్టమొదటి మహిళా ప్రధాన స్పై యాక్షన్ థ్రిల్లర్ కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్‌లో భారతదేశపు తదుపరి తరం సైనికులను తయారు చేసే రహస్య ప్రోగ్రామ్ 'ఆల్ఫా' చుట్టూ కథ తిరుగుతున్నట్లు చూపించారు. 'గొర్రెలా కాదు? తోడేలులా జీవించాలి' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఇక ట్రైలర్‌లో ఆలియా భట్ మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో కనిపించారు. శర్వరీతో కలిసి భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, గూఢచర్యం, హెవీ కాంబాట్ ట్రైనింగ్ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. 'ది రైల్వే మెన్' ఫేమ్ శివ్ రావైల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ఆదిత్య చోప్రా నిర్మాణంలో యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం 2026 జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

------

# మా ఇంటి బంగారంలో సమంత పవర్‌ఫుల్ రోల్

టాలీవుడ్ నటి సమంప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ యాక్షన్ డ్రామా, రిలీజ్‌కు ముందే పెట్టిన పెట్టుబడిని పూర్తిగా రికవరీ చేసుకొని లాభాల బాట పట్టింది. ఈ విషయాన్ని 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై చిత్ర నిర్మాత హిమాంక్ దువ్వూరు అధికారికంగా ప్రకటించారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమాను రూ. 25 కోట్ల నుంచి రూ. 30 కోట్ల మధ్య బడ్జెట్‌తో నిర్మించారు. అయితే థియేట్రికల్, నాన్-థియేట్రికల్ (ఓటీటీ, శాటిలైట్) హక్కులకు మార్కెట్లో భారీ డిమాండ్ ఏర్పడటంతో, అన్ని డీల్స్ రిలీజ్ వారంలోనే విజయవంతంగా క్లోజ్ అయినట్లు తెలుస్తుంది. ఫలితంగా సినిమా విడుదలకు ముందే సేఫ్ జోన్‌లోకి వచ్చేసింది. ప్రస్తుత మార్కెట్‌లో ఒక మహిళా ప్రధాన తెలుగు చిత్రానికి ఇంతటి క్రేజ్ రావడం బలమైన కమర్షియల్ సిగ్నల్ అని చిత్ర బృందం పేర్కొంది. ఈ సందర్భంగా నిర్మాత హిమాంక్ దువ్వూరు మాట్లాడుతూ సినిమా స్క్రీన్‌పైకి రాకముందే పూర్తి పెట్టుబడిని రికవర్ చేయడం 'మా ఇంటి బంగారం'పై మార్కెట్‌కు ఉన్న నమ్మకానికి నిదర్శనం. సమంత పవర్‌ఫుల్ ప్రెజెన్స్, మా కథపై మేం పెట్టుకున్న నమ్మకం ఈ రోజు కమర్షియల్‌గా రిఫ్లెక్ట్ అవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. దర్శకురాలు నందిని రెడ్డి మాట్లాడుతూ సమంతతో 'జబర్దస్త్', 'ఓ బేబీ' తర్వాత నాకు ఇది మూడో సినిమా. నాపై నమ్మకంతో తనే ఈ ప్రాజెక్ట్‌ను నా దగ్గరకు తీసుకువచ్చింది. జూన్ 19న థియేటర్లలో మీరు సమంతను పది రెట్లు ఎక్కువ పవర్‌ఫుల్‌గా చూస్తారు. ఇది నా ప్రామిస్ అంటూ చెప్పుకొచ్చింది. 2023లో వచ్చిన 'ఖుషి' చిత్రం తర్వాత సమంత పూర్తిస్థాయిలో వెండితెరపై కనిపించనున్న చిత్రమిదే. 2024లో వరుణ్ ధావన్‌తో కలిసి 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీస్‌లో మెరిసిన ఆమె, 2025లో తన సొంత నిర్మాణంలో వచ్చిన 'శుభం' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించారు. మళ్లీ మూడేళ్ల తర్వాత థియేటర్లలో ఆమె నటిస్తున్న లీడ్ రోల్ మూవీ కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి.

ఇదిలావుంటే సమంత ప్రస్తుతం గర్భవతి అన్న వార్త ఇప్పుడు అభిమానుల్లో ఆనందం నింపుతోంది. అయితే దీనిపై అటువైపు నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

----------------






# లాయర్ పాత్రలో కీర్తి సురేశ్

## జులై 24న విడుదల కానున్న సత్తియవాన్ సావిత్రి

ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో, కథానాయిక కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కోర్టు రూమ్ డ్రామా చిత్రం 'సత్తియవాన్ సావిత్రి' విడుదల తేదీ ఖరారైంది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని కీర్తి తన ఇన్‌స్టా పోస్ట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా పంచుకున్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా ప్రత్యర్థిని సవాల్ చేస్తున్నట్లు కన్పించింది. ఈ పోస్టర్‌పై అభిమానులు స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మరో పవర్‌ఫుల్ పాత్రలో కీర్తిని చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామంటూ కామెంట్లు పెట్టారు. ఈ చిత్రం గురించి దర్శకుడు ప్రవీణ్ ఎస్ విజయ్ ఇటీవల మాట్లాడుతూ.. 'న్యాయానికీ, చట్టానికీ మధ్య తేడా ఉంటుంది. తన భర్త కేసులో భాగమైన సావిత్రి అనే న్యాయవాది కథే ఈ చిత్రం. ఆమె న్యాయం కోసం పోరాడుతుంటే, ఆమె సీనియర్‌కు మాత్రం చట్టమే ముఖ్యం. పరిస్థితుల కారణంగా ఆమె తన సీనియర్‌తోనే తలపడాల్సి వస్తుంది' అని తెలిపారు. 'హార్ట్ బీట్' ఫేమ్ చారుకేశ్ ఇందులో కీర్తి భర్తగా నటిస్తున్నారు. ఇక కీర్తి తదుపరి ఓ భారీ బ్జడెట్ రొమాంటిక్ థ్రిల్లర్ కోసం ప్రముఖ దర్శకుడితో చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ భారీస్థాయిలో రూపొందనుందని, ఇప్పటివరకు చేయని జోనర్‌లో ఆమె కనిపించనున్నారని టాక్. అటు కీర్తి, రాజ్‌కుమార్ రావ్ జంటగా నటించిన 'రఫ్తార్' చిత్రం కూడా విడుదల కానుంది.

-------

# మరింత మెరుగ్గా సింగ్ గీతం గ్రాఫిక్స్




ప్రముఖ దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో నాగ్ అశ్విన్ నిర్మించిన తాజా చిత్రం 'సింగ్ గీతం' జూన్ 12న థియేటర్లలో విడుదలైంది. ఈ సినిమా క్షి రిలీజ్‌లో కొన్ని కీలక మార్పులు చేసినట్లు నాగ్ అశ్విన్ తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.'ఈ సినిమా ఓటీటీ వెర్షన్.. థియేటర్ వెర్షన్ కంటే భిన్నంగా ఉంటుంది' అని నాగ్‌అశ్విన్ వెల్లడించారు. నిర్మాణదశ చివర్లో ఎదురైన సవాళ్ల గురించి ఆయన ప్రస్తావిస్తూ.. క్లైమాక్స్‌లోని కంప్యూటర్ గ్రాఫిక్స్ ఇంకా మెరుగ్గా ఉండాల్సిందని అనిపించింది. డిజిటల్ విడుదలకు ముందు, గ్రాఫిక్స్‌ని మరింత మెరుగు పరచడానికి మా బృందం యోచిస్తోంది. ఈ చిత్రాన్ని కొన్ని దశాబ్దాల పాటు ప్రేక్షకులు డిజిటల్ వేదికగా ఆదరిస్తూనే ఉంటారు. అందుకే భవిష్యత్తు రోజులకు అనుగుణంగా సాంకేతిక మార్పులు చేయాలని భావించాం' అని పేర్కొన్నారు. ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. కథానాయకుడు విజయ్ దేవరకొండ అతిథి పాత్రలో మెరిశారు. ఈ చిత్ర డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ఫ్లిక్స్‌కి విక్రయించినట్లు సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. అందువల్ల ఓటీటీలోకి రావడానికి కొంత సమయం పట్టొచ్చని తెలుస్తోంది.

----------------

# భారత్‌కు క్రిస్టోఫర్ నోలన్ రాక..
# ముంబైలో 'ది ఒడిస్సీ' గ్రాండ్ ప్రీమియర్




ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు, ముఖ్యంగా భారతీయ ప్రేక్షకులకు ఇది ఒక శుభవార్త. 'ఒపెన్‌హైమర్', 'ఇంటర్‌స్టెల్లార్', 'ఇన్‌సెప్షన్', 'ది డార్క్ నైట్' వంటి అద్భుతమైన చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న దిగ్గజ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తొలిసారిగా భారత్‌లో అడుగుపెట్టనున్నారు. తన సరికొత్త చిత్రం 'ది ఒడిస్సీ' ప్రీమియర్ కోసం ఆయన జులైలో ముంబైకి రానున్నట్లు యూనివర్సల్ పిక్చర్స్ ఇంటర్నేషనల్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి నోలన్‌తో పాటు ఆ చిత్రంలో నటించిన ఆస్కార్ విజేత మ్యాట్ డామన్, ప్రముఖ నటుడు టామ్ హాలండ్, ఆస్కార్ అవార్డు గ్రహీత, నిర్మాత ఎమ్మా థామస్ కూడా హాజరుకానున్నారు. క్రిస్టోఫర్ నోలన్ సినిమా ఒకటి భారతదేశంలో ప్రీమియర్ జరుపుకోవడం ఇదే మొదటిసారి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా జులై 17న థియేటర్లలోకి రానుంది. 'ది ఒడిస్సీ' గ్లోబల్ ప్రీమియర్ టూర్‌లో భాగంగా లండన్, పారిస్, న్యూయార్క్ వంటి ప్రధాన నగరాలతో పాటు ముంబైని కూడా అధికారికంగా ఎంపిక చేయడం భారతీయ మార్కెట్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. హోమర్ రచించిన ఇతిహాసం 'ఒడిస్సీ' ఆధారంగా ఈ చిత్రాన్ని నోలన్ తెరకెక్కించారు. ట్రాయ్ పతనం తర్వాత ఒడిస్సియస్ పదేళ్లపాటు తన ఇంటికి తిరిగి వెళ్లే ప్రయాణాన్ని ఈ చిత్రంలో అద్భుతంగా చూపించనున్నారు. ఈ సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. సరికొత్త ఐమ్యాక్స్ (×హీూశ) ఫిల్మ్ టెక్నాలజీని ఉపయోగించి పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన మొట్టమొదటి ఫీచర్ ఫిల్మ్ ఇదే కావడం విశేషం. ముంబైలోని ఫీనిక్స్ పల్లాడియంలో ఉన్న పీవీఆర్ ఐకాన్ ఐమ్యాక్స్ థియేటర్‌లో ఈ ప్రీమియర్ వేడుక జరగనుంది. ఈ చిత్రంలో మ్యాట్ డామన్, టామ్ హాలండ్‌లతో పాటు ఆన్ హాత్వే, రాబర్ట్ ప్యాటిన్సన్, లుపిటా యోంగో, జెండాయా, చార్లీజ్ థెరాన్ వంటి భారీ తారాగణం నటించింది. నోలన్, ఎమ్మా థామస్ తమ సింకోపీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే భారతదేశంలోని పలు సినిమా థియేటర్లలో 'ది ఒడిస్సీ' ఐమ్యాక్స్ వెర్షన్ కోసం అడ్వాన్స్ టికెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. భారత గడ్డపై జరుగుతున్న అతిపెద్ద హాలీవుడ్ ఈవెంట్‌లలో ఒకటిగా ఈ ప్రీమియర్ నిలవనుంది.

# నవ్వుల వెనుక తీవ్ర వేదన..
## నటి సంచిత మృతిపై స్నేహితురాలి కీలక వ్యాఖ్యలు



ప్రముఖ టెలివిజన్ నటి, 22 ఏళ్ల సంచిత ఉగలే ఆత్మహత్య ఘటన బాలీవుడ్ టీవీ రంగాన్ని పెను విషాదంలో ముంచింది. జూన్ 14న నాలాసోపారా ఈస్ట్‌లోని తన నివాసంలో బెడ్‌రూమ్ సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆమె తనువు చాలించింది. అయితే, చనిపోవడానికి ముందు సంచిత ఎదుర్కొన్న తీవ్ర మానసిక క్షోభను ఆమె ఆప్తమిత్రురాలు, నటి గీతాంజలి, సంచిత కజిన్ ఆకాష్ సతీశ్ ఉగలే మీడియా ముందు బయటపెట్టారు. నటి గీతాంజలి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సంచిత గత జనవరి నుంచి తీవ్రమైన డిప్రెషన్ (మానసిక ఒత్తిడి), ఇన్సోమ్నియా (నిద్రలేమి సమస్య)తో పోరాడుతోందని వెల్లడించింది. "ఆమె గత కొన్ని నెలలుగా అస్సలు నిద్రపోవడం లేదు. మానసిక వేదన భరించలేక.. 'నాకు చనిపోవాలని ఉంది' అంటూ నాతో తరచూ అనేది" అని గీతాంజలి కన్నీరు పెట్టుకుంది. సంచిత తీవ్ర మానసిక స్థితిపై తన వద్ద కొన్ని వాట్సాప్ సందేశాల ఆధారాలు ఉన్నాయని, వాటిని కేవలం పోలీసుల విచారణలోనే అందజేస్తానని స్పష్టం చేసింది. అలాగే, సంచితకు ఎలాంటి వ్యక్తిగత ప్రేమ వ్యవహారాలు లేవని, దయచేసి పుకార్లను నమ్మవద్దని కోరింది. మరోవైపు సంచిత కజిన్ ఆకాష్ ఉగలే, ఆమె తండ్రి మచ్చింద్ర ఉగలే పరిశ్రమలోని కొందరు వ్యక్తులపై సంచలన ఆరోపణలు చేశారు. కాస్టింగ్ సర్క్యూట్‌కు చెందిన కొందరు ఏజెంట్లు సంచితను నిరంతరం మానసిక వేధింపులకు గురిచేశారని ఆకాష్ ఆరోపించారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి ఇండస్ట్రీలో రాణించాలని చూస్తున్న తన సోదరిని టార్గెట్ చేసి టార్చర్ పెట్టారని, అందుకే ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లిపోయిందని వాపోయారు. జూన్ 14న నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణించిన రోజే సంచిత కూడా చనిపోవడం, ఆమె చివరి ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లలో దీనికి సంబంధించిన కొన్ని సింబాలిక్ సూచనలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

# రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం ఘన విజయవంతం

**ప్రతి అర్హత కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా చర్యలుద -ప్రజలకు చేరువైన సంక్షేమం.. వేగవంతమైన అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**

**రాష్ట్ర అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం : మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి**

**'టీమ్ ఎఫర్ట్'తో జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా తీర్చిదిద్దుదాం - జిల్లా కలెక్టర్ జి రాజకుమారి**







**నంద్యాల బ్యూరో, జూన్ 17 (రిపబ్లిక్ న్యూస్):**
ప్రతి అర్హత కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డిలు అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డు ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యం, ఆత్మకూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు,జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఎస్పీ సునీల్ షోరాన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. జిల్లా పరిపాలన యంత్రాంగం సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అధికారులు అందుబాటులో ఉండి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన అన్ని శాఖల అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు.

రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. యువత ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు చేపట్టడంతో పాటు విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పిస్తూ కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఆర్ అండ్ బి శాఖ ద్వారా విస్తృత స్థాయిలో రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గుంతలు లేని రహదారుల లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, నంద్యాల జిల్లా ఆర్థికాభివృద్ధికి వ్యవసాయం, అనుబంధ రంగాలే ప్రధాన ఆధారమని, జిల్లా స్థూల ఆర్థికోత్పత్తి (జీడీపీ)లో దాదాపు 45 శాతం వాటా ఈ రంగాల నుంచే లభిస్తోందని తెలిపారు. గత రెండేళ్లలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా 2.06 లక్షల మంది రైతులకు సుమారు రూ.400 కోట్ల ఆర్థిక సహాయం అందిందన్నారు. విత్తనాలు, ఎరువులు, ఇతర సబ్సిడీల రూపంలో వ్యవసాయ రంగానికి రూ.430 కోట్ల మద్దతు లభించిందని చెప్పారు. హార్టికల్చర్ అభివృద్ధికి 21 వేల హెక్టార్లలో రూ.156 కోట్ల వ్యయంతో కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. మైక్రో ఇరిగేషన్ కింద 8,816 మంది రైతులకు రూ.71 కోట్ల సబ్సిడీ అందించగా, పశుసంవర్ధక, మత్స్యశాఖల ద్వారా కూడా రైతులకు గణనీయమైన ప్రోత్సాహం లభించిందన్నారు. మొత్తంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు గత రెండేళ్లలో రూ.600 కోట్లకు పైగా మద్దతు అందిందని కలెక్టర్ తెలిపారు తెలిపారు.

ముఖ్యమంత్రి ఆశయమైన "వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్" లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో 1,984 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించబడి రూ.58 కోట్ల పెట్టుబడులు ఆకర్షించాయని వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తున్న జాబ్ మేళాలకు విశేష స్పందన లభిస్తోందని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సామాజిక భద్రతా పథకాల అమలులోనూ జిల్లా ముందంజలో ఉందని కలెక్టర్ తెలిపారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ సదుపాయాలు, ఆటో డ్రైవర్లకు భరోసా పథకం, మహిళలకు స్త్రీ శక్తి కార్యక్రమం, దివ్యాంగులకు దివ్యాంగుల శక్తి వంటి పథకాల ద్వారా వేలాది మంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. "తల్లికి వందనం" పథకం ద్వారా 2.59 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.308 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థి మిత్ర కిట్లు వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా గత రెండేళ్లలో 58 వేల మందికి పైగా రోగులకు రూ.123 కోట్లకు పైగా వైద్య సహాయం అందిందని కలెక్టర్ వివరించారు.

ఆర్ అండ్ బి శాఖ ద్వారా రూ.313 కోట్లతో 306 రహదారి పనులు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా వందలాది గ్రామీణ రహదారి పనులు, జాతీయ రహదారుల అభివృద్ధి, తాగునీటి పథకాలు, నీటి వనరుల అభివృద్ధి, మున్సిపల్ మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. జల సంరక్షణకు జలహారతి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ప్రతి నెలా 2.15 లక్షల మందికి పెన్షన్లు అందజేస్తున్నామని, ఇందుకోసం నెలకు రూ.100 కోట్లు, సంవత్సరానికి రూ.1,200 కోట్లు, రెండేళ్లలో రూ.2,400 కోట్లు ఖర్చు చేస్తున్నా మని వివరించారు. అదేవిధంగా బీమా పథకాల ద్వారా 14.85 లక్షల మందికి పైగా లబ్ధి చేకూరగా, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.118 కోట్లు వ్యయం చేశాయని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద రూ.60 కోట్లతో 2,103 పనులు చేపట్టినట్లు, డీఎంఎఫ్ నిధులతో ప్రతి నియోజకవర్గంలో క్యాస్కేడ్ నిర్మాణం, సుందరీకరణ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తేనే నంద్యాల జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లగలమని కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు.

జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే, పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. సాంకేతికత వినియోగంలో భాగంగా డ్రోన్ పెట్రోలింగ్, సీసీటీవీ-360 వెబ్ ప్లాట్‌ఫామ్ ద్వారా నేరాల నియంత్రణ, నేరస్థుల గుర్తింపులో విశేష ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే 70 శాతానికి పైగా ఆస్తి దొంగతన కేసులను ఛేదించి, 85 శాతం ఆస్తులను రికవరీ చేసినట్లు వెల్లడించారు. గంజాయి నియంత్రణలో నంద్యాల జిల్లా రాష్ట్రంలోనే అత్యల్ప వినియోగం కలిగిన జిల్లాల్లో ఒకటిగా నిలిచిందని, మహిళల భద్రత కోసం 'ఆపరేషన్ దండాయం' ద్వారా కేసులను వేగంగా విచారించి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి గత మూడు నెలల్లో 1,500 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడంతో పాటు మద్యం సేవించి భారీ వాహనాలు నడిపిన 17 మంది డ్రైవర్లను జైలుకు పంపినట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు నిర్భయంగా 112 సేవలను వినియోగించుకోవాలని, సమాచారం అందిన 10 నిమిషాల్లోపు పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని స్పందించేలా వ్యవస్థను బలోపేతం చేసినట్లు ఎస్పీ తెలిపారు.

నంద్యాల పార్లమెంటు సభ్యులు బైరెడ్డి శబరి మాట్లాడుతూ, గత రెండేళ్లలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడం, రైల్వేలు, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రైతులకు సాగునీరు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తూ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పెన్షన్లు, తల్లి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరుతున్నాయని, అందుకే ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రగతికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకువస్తున్నామని తెలిపారు.

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, తుంగభద్ర జలాల విషయంలో సీఎం జోక్యంతో కేసీ కాలువకు నీటి విడుదల సాధ్యమైందని తెలిపారు. అలాగే గోరకల్లు రిజర్వాయర్ మరమ్మతులు, ఇతర సాగునీటి ప్రాజెక్టులకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి పనులు చేపట్టినట్లు వివరించారు.

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించడం, గ్రామాల స్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడం, పెన్షన్ల పంపిణీలో ప్రజల ఇళ్లకు వెళ్లడం వంటి చర్యల ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాయకత్వంలో సామాజిక పెన్షన్లను రూ.4,000కు పెంచడంతో పాటు వికలాంగులు, డయాలసిస్ రోగులు, మంచానికే పరిమితమైన వారికి అధిక ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి భారీ కేటాయింపులు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే నీటి కొరత ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విజయవంతమైందన్నారు.

అంతకుముందు 19 ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ ప్రదర్శన స్టాళ్లను మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## జూన్ 21 యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం : జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**యోగాభ్యాసంతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత సాధ్యం -జిల్లాలో 3.50 లక్షల మంది నమోదు**







**నంద్యాల బ్యూరో, జూన్ 17 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమం ద్వారా ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన సమాజ నిర్మాణానికి బలమైన పునాది పడుతోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం ఉదయం నంద్యాల ఇండోర్ స్టేడియం ఆవరణలో యోగాంధ్ర అసోసియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శ్రీ సూరజ్ ధనుంజయ్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం యోగా నిపుణుల సూచనల మేరకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యాన సాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగాభ్యాసం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందడంతో పాటు ఒత్తిడి తగ్గుతుందని వివరించారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడులు, జీవనశైలి సంబంధిత అనారోగ్య సమస్యలకు యోగం సమర్థవంతమైన పరిష్కారంగా నిలుస్తోందన్నారు. శరీరం, మనసు, ఆత్మల సమన్వయమే యోగమని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ యోగాభ్యాసం చేయడం వల్ల వ్యక్తిగత జీవితం, వృత్తిపరమైన జీవితం మధ్య సమతుల్యత సాధించవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని గ్రామ స్థాయి వరకు విస్తరించి ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇప్పటివరకు జిల్లాలో 3.50 లక్షల మంది 'యోగాంధ్ర' యాప్, పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా నమోదు చేసుకోవడం హర్షణీయమని అన్నారు. జూన్ 21న జిల్లాలోని ప్రతి గ్రామం, వార్డు, మండల కేంద్రం, నియోజకవర్గ కేంద్రం, జిల్లా కేంద్రంలో భారీ స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల లక్ష్యమని పేర్కొంటూ, ఆసక్తి కలిగిన ప్రజలందరూ తమ పేర్లు నమోదు చేసుకుని యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని యోగా సంస్థలు యోగాంధ్ర కార్యక్రమంలో చురుకుగా భాగస్వామ్యం కావడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమ విజయవంతానికి సహకరిస్తున్న యోగా గురువులు, యోగా అసోసియేషన్లు, ఆయుష్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, క్రీడాశాఖ అధికారులు, నోడల్ అధికారి డాక్టర్ యశోధరతో పాటు సంబంధిత శాఖలందరికీ కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు, విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా యోగాభ్యాసం చేశారు.

## జిల్లా జైలు నందు న్యాయ అవగాహన సదస్సు.

**కర్నూలు టౌన్ జూన్ 17,రిపబ్లిక్ న్యూస్ :**
17వ తేదీ మంగళవారం నాడు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి / జిల్లా న్యాయ సేవాది కార సంస్థ అధ్యక్షులు జి. కబర్థి మరియు బి. లీలా వెంకట శేషాద్రి , కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాది కార సంస్థ, కర్నూల్ వారు జిల్లా కారాగారము నందు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జైలు నందు ఏర్పాటు చేసిన ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను మరియు ములాఖత్ హెల్ప్ డెస్క్ ను తనిఖీ చేసి "జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ మరియు ములాఖత్ హెల్ప్ డెస్క్ " గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా
జైలులో ఉన్న ఖైదీలు వారి కున్న హక్కుల ను తెలుసు కోవాలని తెలిపారు.ఖైధి లకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పై బడిన ఖైధిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తా మని త్యరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైధి లకు అందించే ఆహారాన్ని,రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైధి లను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చును అన్నారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు శివరాం మరియు సులోచన, హెల్ప్ డెస్క్ న్యాయ వాది ప్రవీణ్ కుమార్, ప్యారా లీగల్ వాలెంటీర్స్ హేమంత్, ఓం ప్రకాష్, శివాని,ఖైదీలు పాల్గొన్నారు.

## హోంమంత్రి అనితపై వైసీపీ నేతల వ్యాఖ్యలు ఖండనీయం: గుడిసె ఆది కృష్ణమ్మ

**మహిళల గౌరవాన్ని కాపాడడంలో వైసీపీ విఫలమైందని విమర్శ**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 17)**
రాష్ట్ర హోంమంత్రి శ్రీమతి అనిత పై వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ నాయకురాలు శ్రీమతి గుడిసె ఆది కృష్ణమ్మ తీవ్రంగా ఖండించారు. గుడిసె ఆది కృష్ణమ్మ విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, మహిళా హోంమంత్రిపై వైసీపీ నేతలు చేసిన జుగుప్సాకర వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమని పేర్కొన్నారు. మహిళల గౌరవం గురించి మాట్లాడే వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, తన పార్టీ నాయకులు మహిళలను అవమానించిన సందర్భాల్లో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.సొంత చెల్లెలు వైఎస్ షర్మిలపై అవమానకర వ్యాఖ్యలు జరిగిన సమయంలో కూడా జగన్ స్పందించలేదని, అలాంటి పరిస్థితుల్లో మహిళల గౌరవంపై మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదని విమర్శించారు. వైసీపీ నాయకులు మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఆ పార్టీ సంస్కృతికి ప్రతిబింబమని ఆరోపించారు.ప్రజా సమస్యలపై చర్చించలేని వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలు, అసభ్య వ్యాఖ్యలతో రాజకీయాలు చేస్తున్నారని, ఇది వారి దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. మహిళలను అవమానించడం వైసీపీకి అలవాటుగా మారిందని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని పేర్కొన్నారు.మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ప్రతి చర్యకు ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా తగిన సమాధానం ఇస్తారని కృష్ణమ్మ హెచ్చరించారు. "మహిళలపై గౌరవం మాటల్లో కాదు, చేతల్లో చూపించాలి. జగన్ మౌనం వైసీపీ మనస్తత్వానికి సాక్ష్యం" అని ఆమె వ్యాఖ్యానించారు.

## ఇంద్రకీలాద్రిపై సామూహిక అక్షరాభ్యాసం

**భారీగా తరలివచ్చిన చిన్నారులు, తల్లిదండ్రులు**

**విజయవాడ,జూన్ 17,రిపబ్లిక్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం వైభవంగా నిర్వహించారు. నిజ జేష్ఠ తదియ సందర్భంగా ఈ మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 6 గంటలకే మహా మండపం 6వ అంతస్తుకు భారీ ఎత్తున ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు, వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే ప్రవేశాన్ని కల్పిస్తున్నారు. చిన్నారితో పాటు తల్లిదండ్రులకు మాత్రమే అమ్మవారి దర్శనానికి అనుమతి ఇవ్వనున్నారు. ఉదయం 8:06 గంటలకు శుభ ముహూర్తంలో అక్షరాభ్యాసం ప్రారంభమైంది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవోపేతంగా అక్షరాభ్యాస కార్యక్రమం మొదలైంది. పలక, బలపం, పూజా సామాగ్రిని ఆలయ అధికారులు ఉచితంగా అందజేస్తున్నారు. అక్షరాభ్యాసం అనంతరం అమ్మవారి దర్శనం, ప్రసాదాలు ఉచితంగా ఇవ్వనున్నారు. సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం సందర్భంగా సమయపాలన పాటించాలని భక్తులకు ఈవో శీనా నాయక్ విజ్ఞప్తి చేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com